Whatsapp No: 9440662699

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సంపుటి : 2 సంచిక 33, పేజీలు 8 రూ. 2/-

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక

సోమవారం 8- ఆదివారం14, మే 2017



ఆపిల్ సీఈవో జెఫ్‌తో సీఎం చంద్రబాబు

### ఆపిల్ సీఈవోతో

## ఏపీ ప్రభుత్వం మూడు ఒప్పందాలు

**అమెరికా:** ఆపిల్ సీవోవోతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ఒప్పందాలను కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నవిషయం తెలిసిందే. ఆయన శనివారం ఆపిల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం సుస్థిర వృద్ధి ఫలితాలు సాధిస్తూ భారతదేశం బలీయమైన దేశంగా ఎదిగిందని ఆపిల్ సీవోవోకు చంద్రబాబు వివరించారు. అలాగే భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అత్యుత్తమమని చంద్రబాబు వివరించారు. వృద్ధి, అభివృద్ధి అంశాల్లో సరైన భాగస్వామ్యం కోసం అన్వేషిస్తున్నామని, ఏపీలో పెట్టుబడులు పెట్టి మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయండని ఆపిల్ సీవోవోను చంద్రబాబు కోరారు.

# రాజధాని నిర్మాణంలో ఫోర్జరీ





**రా.వా.ప్రతినిధి,అమరావతి :** రాజధాని నిర్మాణంలో ప్రతి అడుగులోనూ అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మూడుపంటలు పండే జరీబు భూమి,వరద ముంపు ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం వద్దంటూ శివరామ కృష్ణన్ కమిటీ స్పష్టం చేసినప్పటికీ అక్కడి భూములను లాక్కోవడం దీనికి తార్కాణవమని పండలనేని శ్రీమన్నారాయణ విమర్శిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం సీఆర్‌డీఏ ఫోర్జరీ సంతకాల నివేదికలతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)నే తప్పు దారి పట్టించిందని సమాజిక కార్యకర్త శ్రీమన్నారాయణ పిటిషన్ దాఖలు చేశారు. గత రెండేళ్లుగా ఎన్‌జీటీలో జరిగిన వాదోపవాదాలు ఎలా ఉన్నప్పటికీ ఇక ఈ ఫోర్జరీల పైనే తమ న్యాయ పోరాటం సాగుతుందని ప్రకటించారు. రాజధాని నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని అయితే కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి లేకుండా అమరావతి ప్రాంతంలో ఎలాంటి పనులు చేపట్టరాదంటూ ఎన్‌జీటీ 2015 అక్టోబరు 10న స్టే ఇచ్చిందన్నారు. అయితే సీఆర్‌డీఏ అధికారులు ఒకరోజు ముందే అంటే అక్టోబరు 9న పర్యావరణ అనుమతులు పొందినట్లు ఫోర్జరీ పత్రాలను కోర్టుకు సమర్పించి తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో శంకుస్థాపన చేయించి పంటపొలాల విధ్వంసానికి దిగటంతో ప్రభుత్వం పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశామని శ్రీమన్నారాయణ తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం వాస్తవాలకు మసి పూసి మారేడుకాయ చేస్తుందని, సీఆర్‌డీఏ 2014 డిసెంబరు 30న ఏర్పడితే పాత తేదీలతో డిప్యూటీ జనరల్ మేనేజర్ అశిష్ దేశ్‌పాండే ఫోర్జరీ సంతకంతో మరో నివేదిక పంపారన్నారు. అసైన్డ్ భూములతోపాటు అక్కడ పట్టాభూముల ఇళ్లు వాకిళ్లు ఉన్నప్పటికీ నిర్మానుష్య భూమిగా ప్రభుత్వ చూపడాన్ని సవాలు చేస్తూ అఫిడవిట్ దాఖలు చేశామన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని శ్రీమన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

### చండ ప్రచండ భానుడికోలేఖ...

సమస్త జీవకోటికి
ఆధారభూతుడివైన భానుడికి నమస్సులు...
భూగోళంపై మీరు లేని జీవితం ఊహించలేం.. అయినప్పటికీ
మీరు ఈ మధ్య చండ ప్రచండంగా మీ ఉగ్రరూపాన్ని
చూపుతున్నారు.. దీంతో పిల్లా..జెల్లా.. ముసలీ ముతకా..టపా
కట్టేస్తున్నారు. అత్యవసర పనులపై బయట అడుగుపెట్టాలంటే
భయం వేస్తుంది అందువల్ల మా యందు దయ ఉంచి మీ
ఉష్ణోగ్రత తగ్గించుకుంటే మేము బ్రతికి బట్టకడతాము..

– సదా మీ ఆశీస్సులు కోరే, మేథావి (మనిషి)

### భానుడి ప్రత్యుత్తరం



చిరంజీవి మేథావికి... మీ లేఖ అందింది...
మీకు మా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి...
అయితే మీరు గుర్తుంచుకోవాల్సిన విషయాలు
కొన్ని ఉన్నాయి.. వాటిని పాటిస్తే మీరు
కలకాలం చల్లగా సుఖసంతోషాలతో ఉండొచ్చు...
వాటిలో ముఖ్యమైనది మీరు తక్షణమే చెట్ల నరికి వేతను
అడ్డుకోండి...కర్బన ఉద్గారాలు పెంచే కార్లు, స్కూటర్లు,
లాంటి వాహనాలను తగ్గించి సైకిలు ప్రయాణాలను
ప్రోత్సహించండి.. అలాగే ఊళ్లకు ఊళ్లు కాంక్రీటు జంగల్స్‌గా
మార్చకుండా పర్యావరణ హితంగా ఉండే పాత కాలం నాటి
నిర్మాణాలు చేపట్టి, ఊర్లో చెరువులను పూడిక తీయండి.
అప్పుడు ఎండతీక్షణత నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు..
దయ చేసి నాపై అభాండాలు వేయడం మానండి ...

– సదా మీ శ్రేయస్సుకోరే, భానుడు

- రాష్ట్రంలో పెట్టుబడులకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అమెరికా ప్రయాణం
- ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యం : ప్రధాని
- రాజధాని అభివృద్ధి పనులపై గుంటూరు కలెక్టర్ సమీక్ష

**ఊవారం రాజధాని**

- అమరావతి భూకుంభకోణాలపై విచారణ జరపకపోతే మహాదర్నా : కాంగ్రెస్‌నేత రఘువీర
- విజయవాడ అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్‌గా వేదాంతం రాజగోపాల చక్రవర్తి నియామకం.
- రెండేళ్లలో ఐటీలో లక్ష ఉద్యోగాలు, తయారీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు : మంత్రి లోకేష్

సమ్మర్ కోచింగ్
రాజధాని వార్తలు
రాయపూడి, పరిసర ప్రాంతగ్రామస్తులకు శుభవార్త
10వ, తరగతి ఆపై చదివిన విద్యార్థులకు
అతి తక్కువ ఖర్చుతో MS office, DTP ఇంగ్లీషు, తెలుగు నేర్పబడును.
వివరాల కోసం
94406 62699

## ప్లీనరీ నుంచి ఎన్నికల ప్రచారం



**రా.వా.ప్రతినిధి,వైవి.రావు- విజయవాడ :** రాజకీయంగా చైతన్యవంతమైన విజయవాడ నుంచే వైసీపీ ఎన్నికల ప్రచారానికి తెరతీయనున్నట్లు తెలుస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని జూన్ 8,9 తేదీలలో ప్లీనరీని ప్రారంభించనున్నారు. తదనంతరం జిల్లా ప్లీనరీనలను జూన్19,20న నిర్వహిస్తామని ఆ పార్టీ సీనియర్ నేత ఉమారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో మీటింగులు పెట్టి ముఖ్యమైన సమస్యలపై చర్చలు జరుపుతామన్నారు. 2019 ఎన్నికలకు ప్లీనరీతో శంఖారావం చేసి, వచ్చే రెండు సంవత్సరాలలో పార్టీ చేయబోయే కార్యక్రమాలను రూపొందించి పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులను ఉత్తేజపరుస్తామని ఉమారెడ్డి వెల్లడించారు.

### రాజధానివైపు

## వెళ్లొద్దురా డింగరీ....

**రావా డెస్క్ :** టౌను పక్కకెళ్లొద్దురా డింగరీ ..టౌను పక్కకెళ్లేవో డౌన్ అయిపోతావురా ..అని పాత సినిమా తోడికోడళ్లు సినిమాలోని పాట మీకు గుర్తు ఉండే ఉంటుంది. దానిని ప్రస్తుతం రాజధానివైపు వెళ్లొద్దురా డింగరీ... అని ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పనులపై రాజధాని పరిసరప్రాంతాలకు వచ్చినవాళ్లు పాడుకుంటున్నారు. నిజానికి డొంక రోడ్లు, రోజుకు మూడు బస్సులు ఉండే ఈ ప్రాంతంలో ప్రస్తుతం రోడ్డు రవాడా బస్సులు పెరిగిన మాట వాస్తవం.. అంతేకాదు ఇప్పుడిప్పుడే సీడ్ యాక్సెస్ రోడ్లు పడుతున్నాయి. పదేళ్లు (మూడేళ్లు గడిచాయి) సమయం ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాత్కాలిక సచివాలయం ఏర్పాటు చేసి హడావుడిగా సచివాలయ ఉద్యోగులందర్నీ ఇక్కడకు రప్పించారు. ఏప్రిల్ 22 వరకు అప్ అండ్ డౌన్ చేసిన ఉద్యోగులు పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వడంతో రెండు కుటుంబాలను సాకలేక ఇక్కడే ఉండిపోదామని కొత్తగా కడుతున్న ఇళ్లను అద్దెకు అడుగుతుంటే కళ్లు తిరిగే అద్దెలు చెపుతున్నారు ఇక్కడి వాళ్లు...ఇక్కడ అద్దెలు తగ్గించి ఉద్యోగులకు సహాయపడాలని ఏడాదిన్నర క్రితం సాక్షాత్తూ సీఎం చెప్పినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు రూ.1,2000, ట్రిపుల్‌బెడ్‌రూం ఇళ్లు రూ. 15000 చెబుతున్నారు. పిల్లలకో పెద్దలకో ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే ఇక్కడ సరైన ఆసుపత్రిలేదు, పిల్లలకు మంచి స్కూళ్లు లేవు.. దారులు ఇప్పుడిప్పుడే వేస్తున్నారు.. అద్దెలు చూస్తే బారెడు... సచివాలయం వచ్చిందికదా అని వెలగపూడి రోడ్లన్నీ హూటళ్లతో నింపేశారు. ఆనక ఒక్కొక్కరే నష్టాలతో మూసుకుంటున్నారు. ఇక్కడ నిత్యావసర వస్తువులు కూడా ఖరీదుగానే ఉంటాయి. విజయవాడలో లీటర్ కొబ్బరి నీళ్లు రూ. 60-70 ఉంటే ఇక్కడ రూ. 80 ఉంటుంది. ఇస్త్రీ

- మిగతా 2 లో

# రాజధాని వార్తలు

కలం

## తక్షణమే ప్రభుత్వం మిర్చిరైతులను ఆదుకోవాలి

పుడమితల్లిపై ఏ ఏడాదికాయేడాది నమ్మకం పెంచుకుంటూ ఈ ఏడాదైనా అప్పులు తీరవా..బ్రతుకు పండదా అనుకుంటూ రైతన్న ఆశతో వ్యవసాయం చేస్తూనే ఉంటాడు. గతేడాది క్వింటాలు ఎండుమిర్చి రూ. 15 వేలు రావడంతో ఈ ఏడాది 30 వేల హెక్టార్లు ఎక్కువ సాగు చేశారు. అంత ఎక్కువ సాగు చేస్తే దిగుబడి పెరిగి, రేటు తరుగుతుందని, ప్రభుత్వం,లేదా అధికారులు ఎవ్వరూ రైతుల్ని అప్రమత్తం చేయలేదు. విస్తీర్ణాన్ని స్థిరీకరించి అవసరాలకు మేరకే పండించండి అని ఉంటే మిర్చిరైతు కుళ్లికుళ్లి ఏడవాల్సిన పరిస్థితి ఉండేదికాదు... రైతుల పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరితో ఉంటుందనడానికి తార్కాణం ఇదే.. మొన్న చెరకు, నిన్న పత్తి నేడు మిర్చి, ఇలా ఒకదాని వెంట మరోకటి రైతుల్ని నష్టాలకు, కష్టాలకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరకు సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గిపోయింది. ఒకప్పుడు పంచదారను ఎగుమతి చేసే మనదేశం ఇప్పుడు దిగుమతికి ద్వారాలు తెరచింది. గత రెండేళ్ళు పత్తిరైతులు అష్టకష్టాలు పడ్డారు. గిట్టుబాటుధర లేకనష్టాలతో గతేడాది క్వింటాలు తంతంతంతంతంతంతంతరూ. 12 వేల రూపాయలు అమ్మిన మిర్చి, ఈ ఏడాది రూ. 5,000లకు కొనే నాదుడు లేక రైతులు దిగాలుపడి దిక్కులు చూస్తున్నారు. అత్యాశతో అధిక విస్తీర్ణంలో సాగు చేయటమే ధరలు తగ్గటానికి కారణమని ఏసీ గదుల్లో కూర్చున్న కొందరు చిలక పలుకులు పలుకుతున్నారు. ఎండనక– వాసనక, రేయింబవళ్ళు కష్టించి, అప్పులు చేసి, రైతు అత్యాశతో అధిక ఉత్పత్తి చేయటం లేదని వారు గుర్తెరిగితే మంచిది. రైతు అమ్ముకొన్నాక ఆ రైతుకు ఆ పంట ద్వారా పైసా ఆదాయం కూడా రాదు. ఎంతో మంది వ్యాపారులు అంచెలంచెలుగా లాభాలు గడిస్తుంటారు. ఒకరి నుంచి మరొకరి రికార్డు పరంగా చేతులు మారినప్పుడల్లా ప్రభుత్వనికి పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతూనే వుంటుంది. విదేశాలకు ఎగుమతి జరిగినపుడు విదేశీ మారక ద్రవ్యం సమకూరి ప్రభుత్వాలకు మేలు జరుగుతుంది. పండించిన రైతుకు మిగిలేది శ్రమ లేదా నష్టం. లాభం పొందేది మాత్రం వ్యాపారులు, ప్రభుత్వం. ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు మద్దతు ధరలు, ఇంకోవైపు ప్రభుత్వ విధానాలు రైతుల్ని నష్టాల్లో ముంచుతున్నాయి.

గిట్టుబాటు ధర కోసం మిర్చి రైతులు రోడెక్కి ఆందోళనలు చేశారు. మిర్చి బస్తాలను రోడ్లపై కుమ్మరించి తగలబెట్టి హార్తాళ్‌లు నిర్వహిస్తూ, జిల్లా కలెక్టరు కార్యలయిాలను దిగ్బంధించారు. దీంతో క్వింటాలుకు రూ. 8000 కంటే తక్కువకు అమ్మిన వారిని రూ. 1500 ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. నిజానికి ఇది నామమత్ర సహాయమే... గతేడాది ఎండు మిర్చి పండించిన విస్తీర్ణం 1,56,068 హెక్టార్ల కాగా , ఈ ఏడాది 1,85,981 హెక్టార్లలో రైతులు సాగుచేశారు. గ్రామాల వీఆర్‌ఓలను ఏ సర్వేనెంబరులో ఏ పంట వేశారు...వాటి ఫోటోలేవి...నెలానెలా ఫోటోలు తీయండి ...అంటూ అంత విస్తీర్ణంలో మిర్చి సాగుచేస్తుంటే ఏం చేసినట్లు ?అవినీతిని సహించను.. చండశాసనుడిని నేను అని చెప్పేముఖ్యమంత్రి శీతగిడ్డంగుల్లోని అక్రమార్కులను ఎందుకు సహిస్తున్నారు.. ఆరుకాలం కష్టపడి పండించిన రైతులను దోచుకుంటుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారో ఆయనకే తెలియాలి. రెండు మూడు నెలలకు ఒకసారైనా విదేశాలు వెళ్లే ముఖ్యమంత్రి ఆయా దేశాల్లో మిర్చి ఎగుమతుల కోసం ఎందుకు ప్రయత్నించడం లేదు ?

అన్ని వివరాలు నా డ్యాష్ బోర్డులో ఉన్నాయంటూ రైతుల దగ్గరకొచ్చేటప్పటికి ఎందుకు ఒక్క అలక్ష్యం చూపుతున్నారో అర్థం కాదు. ఆయన కూడా రెండు ఎకరాల రైతుకుటుంబం నుంచి వచ్చిన విషయం గుర్తుంచుకోవాలి. పాలన అంటే ప్రతిపక్షాలను కట్టడి చేయడమో, మంత్రివర్గాన్ని విస్తరించడమో కాదు.. రైతు సమస్యలను సత్వరమే తీర్చగల సత్తా ఉండటమని గ్రహించాలి.

## పౌరులు–చట్టాలు

### Law-Citizen



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com

10



రాజ్యాంగం అమలు తర్వాత చట్టాలు రాజ్యాంగ అధికరణం 13(2) రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత చేయబడిన చట్టాలకు సంబంధించింది. రాజ్యాంగంలోకి మూడవ భాగంలో ఇవ్వబడిన హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చట్టాలు ప్రభుత్వం చెయ్యకూడదు. అలా చేయబడిన చట్టం హక్కుల ఉల్లంఘన భాగం వరకు చెల్లుబాటుకాదు. ఈ చెల్లుబాటు గురించి తదుపరి సవరణలకు సంబంధించిన మార్పులు వర్తిస్తాయి.

రాజ్యాంగ అధికరణ 13(3) చట్టం (Law),అమలులో ఉన్న చట్టాలు (Law in free) గురించి నిర్వచిస్తుంది. చట్టాలకు సంబంధించిన సాధారణ నిర్వచనాలకు ఇది సరిపోతుంది.

చట్టాలను రెండుగా విభజిస్తారు.

1. చట్టసభల్లో నేరుగా చేయబడిన చట్టాలు. (Statutory Laws)

2. అధికారం పొందిన తక్కువ స్థాయి(Subordinate) వ్యవస్థలు ఉదా!! నియమ నిబంధనలు, ఆదేశాలు వగైరా (rules,orders,regulations,notifications and bye-laws) అలాగే ఆచార్యవ్యవహారాలు(Customs,Usages).

1961లో సుప్రీంకోర్టు దశరథరామారావు వి.ఎస్.ఆం.ప్ర.ప్రభుత్వం కేసులో " ఏదైనా ఆచారం చట్టం చేత గుర్తించబడినా,ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉండరాదు." అని తీర్పు ఇచ్చింది. 1967 నాటి గోలక్‌నాథ్ వి.ఎస్. స్టేట్ ఎయిర్ ఎస్.సి. 1643 కేసులో మరొక కీలకమైన తీర్పు ఇచ్చింది. రాజ్యాంగ అధికరణం 13(2)లో చెప్పబడిన 'చట్టం'(Law) అనే మాటకు రాజ్యాంగ సవరణలు,తదుపరి పరిణామాలు, ప్రాథమిక హక్కుల వంటివి అంతర్గతంగా ఉన్నాయని చెప్పింది. ప్రాథమిక హక్కుల్ని రద్దు చేసే చట్టమే చెల్లుబాటుకాదు.

1971 సం॥లో రాజ్యాంగ అధికరణం 13కి సవరణ ద్వారా నిబంధన (Law) 4 కలపబడింది. ఇది రాజ్యాంగానికి చేయబడిన 24 వ సవరణఅయితే,యీ విభజన ఏకపక్షంగా ఉండకూడదు. అది ఏ ప్రయోజనం కోసం చేయబడిందో దానికి ఉపయుక్తంగా ఉండాలి. 14వ అధికరణం : Equality Before Law Article)

ఈ అధికరణం ప్రకారం " భారతదేశ హద్దుల్లోపల, ప్రభుత్వం ఏవ్యక్తికీ చట్టం ముందు సమానత్వం లేక చట్టపరిరక్షణను కలిగించకుండా ఉండరాదు"

చట్టం ముందు సమానత్వం (Equality Before Law), చట్టాల సమాన రక్షణ (Equal Protection of Laws) రెండూ వేర్వేరు మొదటిది ఇంగ్లీషు చట్టాలనుండీ తీసుకున్నది. ఇది వ్యతిరేక (negative)భావాన్నికల్గి ఉంది. అంటే వ్యక్తిహోదాకి, ఇతర స్థితిగతులతో నిమిత్తం లేకుండా (ప్రధానితో సహా) చట్టం ముందు అందరూ సమానులే. ప్రత్యేక సదుపాయం (privilige) ఉంటే – ఈ అధికరణం నుండీ మినహాయింపు లభిస్తుంది.

రెండవ వివరణ "Equal Protection of the laws" చట్టాల సమాన రక్షణ. సమాన పరిస్థితుల్లో సమానంగా పరిగణించటం సమానస్థాయి గల వారికి సమానంగా చట్టాలు వర్తింపజేయటం ఇందులోని ప్రథానాంశం. అసమానులమధ్య ఒకే చట్టాలను వర్తింప చేయకూడదు.

14 అధికరణం కేవలం పౌరులకే కాదు. ఇతరులకూ వర్తిస్తుంది. అంటే మన దేశంలో నివసించే ఏవ్యక్తి అయినా ఈ ప్రాథమిక హక్కును పొందవచ్చు. అలాగే చట్టప్రకారం వ్యక్తిత్వం (Juristic Person) గల కార్పొరేషన్ కూడా ఈ అధికరణ లాభం లభిస్తుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు 1951 నాటి (41--) చిరన్‌జీత్‌లావ్ చౌదరి యూ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్పష్టం చేసింది. ఇది గమనించాల్సిన అంశం.

(సశేషం)

## ఎంసెట్‌లో గుంటూరు విద్యార్థుల హవా

**రా.వా. ప్రతినిధి, జాకీర్–గుంటూరు:** విద్యా కేంద్రంగా గుంటూ రుకు పేరుంది. ఎంసెట్ ఫలితాల్లో గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యు త్తమ ప్రతిభ కనబరి చారు. ఇంజినీరింగ్,మెడిసిన్ విభాగాల్లో మొదటి పది ర్యాంకుల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉండటంతో మరోసారి గుంటూరు జిల్లా ఖ్యాతి మార్మోగింది. ఇంటర్ విద్యకు రాష్ట్రం నలుమూలల నుంచి గుంటూరుకు వస్తారు. దీంతో గత కొన్నాళు ్లగా ఎంసెట్,జేఈఈ ఫలితాల్లో గుంటూరు తన స్థానాన్ని ఎప్పటికప్పుడు మరింత మెరుగు పరచుకుంటోంది. ఇటీవల ముగిసిన ఎంసెట్ పరీక్షల్లో మెడిసిన్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన ఊటుకూరి వెంకట అనిరుథ్‌ది గుంటూరు నగరమే. అనిరుథ్ తల్లిదం డ్రులిద్దరూ ప్రైవేటు వైద్యులుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 4 వ ర్యాంకు సాధించిన గోరంట్ల జయంత్ హర్ష గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం ముత్తాన్నపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి, వీరు కాకుండా ఆయా జిల్లాల నుంచి గుంటూరులో పలు కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో చదివిన విద్యార్థులు మొదటి వంద ర్యాంకుల్లోపు వచ్చిన వారు ఐదుగురు ఉన్నారు. మొత్తానికి ఎంసెట్ ఫలితాల్లో గుంటూరు చెందిన ఇద్దరు విద్యార్థులు మొదటి పది లోపు ర్యాంకులు సాధించి గుంటూరు ఖ్యాతిని ఇనుమడింపజేశారు.



అగ్రికల్చర్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచిన అనిరుథ్




ఇంజినీరింగ్‌లో 4వ ర్యాంకు సాధించిన గోరంట్ల జయంత్ హర్ష

## రాజధాని వైపు వెళ్లొద్దురా డింగరీ....

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడలో చీరకు రూ. 15 చార్జి చేస్తుంటే ఇక్కడ రూ. 25 తీసుకుంటారు. టైలరింగ్ చార్జీలు కూడా అలాగే ఉంటున్నాయి. విజయవాడ , గుంటూరు ఫ్యాషన్ డిజైనర్లు తీసుకునే రేట్లు ఈ ప్రాంతంలో వసూలు చేస్తారు.. అలా అని ఇక్కడ ఇక్కడ నైపుణ్యం గలవారెవరూ లేరు. దీంతో డబ్బుపోయే శనిపట్టే అన్న చందంగా బాధపడాల్సిందే.. కాకపోతే ఏంటయ్యా ఈ రేట్లు కార్పొరేట్ నగరాల్లో కూడా లేదుగా అన్నామనుకోండి... పంటలూ లేవు..పనులూ లేవు మేమెలా బ్రతకాలి అంటున్నారు... భూములు లాక్కుంది ప్రభుత్వం..బాధలు పడేది ప్రజలా.. ఇదెక్కడి న్యాయం...




## రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్ము?



**భువనేశ్వర్ :** భారతరాష్ట్రపతి పదవి కోసం ఒడిశా రాష్ట్రానికి చెందిన దళిత వర్గం మహిళా నాయకురాలు ద్రౌపది ముర్మును బీజేపీ ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పదవీకాలం ఈ ఏడాది జులై నెలతో ముగియనుంది. తదుపరి రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక కోసం ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. ఎన్డీఏ కూటమి వర్గాల నుంచి రాష్ట్రపతి పదవిపట్ల ఔత్సాహికుల జాబితా బలం పుంజుకుంటోంది.

ఆమె గిరిజన మహిళ కావడంతో అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు. 2015, మే 18 నుంచి ద్రౌపది ముర్ము జార్ఖండ్ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. జార్ఖండ్‌లో తొలి మహిళా గవర్నర్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలోని మయూర్‌భంజ్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలుగా బాధ్యతలను గతంలో విజయవంతంగా నిర్వహిం చారు. రాష్ట్రశాసన సభకు వరుసగా 2 సార్లు ఆమె ఎన్నికయ్యారు. రాష్ట్రంలో బిజూ జనతాదళ్, భారతీయ జనత పార్టీ కూటమి సర్కారులో ఆమె మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

# అహింసా మార్గదర్శి బుద్ధ జయంతి

( మే 10న బుద్ధ జయంతి సందర్భంగా )

బుద్ధపౌర్ణిమ లేదా బుద్ధ జయంతిని వైశాఖ పూర్ణిమ నాడు జరుపుకుంటారు. ఇది హిందూ కేలండర్ ప్రకారం ఏప్రిల్ లేదా మేనెల మొదట్లో వస్తుంటుంది. బుద్ధ పూర్ణిమ బౌద్ధులకు ముఖ్యమైన పర్వదినం. బుద్ధుడు క్రీస్తు పూర్వం 560లో జన్మించి 80 ఏళ్ల వయసులో క్రీస్తుపూర్వ 480లో పరమపదించాడు. తన మరణానంతరం భారత ఉపఖండంలో బౌద్ధమతం బహుళ ప్రజాదరణ పొంది విదేశాల్లో కూడా పలుకుబడి సంపాదించుకుంది. బుద్ధ పౌర్ణమి రోజున బుద్ధుడు జీవితానికి సంబంధించి పంచసూత్రాలను, సత్యానికి సంబంధించిన అష్టాంగ మార్గాలను బోధించిన అనంతరం జ్ఞానోదయం పొందాడు. బుద్ధుడు సరిగ్గా తన జన్మదినం రోజే నిర్వాణం పొందాడు. లేదా ప్రపంచాన్ని వదలి వెళ్లిపోయాడు. ఈ విధంగా బుద్ధ జయంతి గౌతమబుద్ధుడి జీవితంలోని మూడు కీలకమైన ఘటనలను వర్తిస్తుంది. ప్రపంచం నలుమూలలనుంచి బౌద్ధులు బుద్ధ జయంతిరోజు భారత్ లోని బోధ్ గయకు వచ్చి బుద్ధ పౌర్ణమి సంబరాల్లో పాలు పంచుకుంటారు. ఈ సందర్భంగా వారు బుద్ధ చిత్రాలను చిత్రిస్తారు. సామూహిక ధ్యానంలో పాల్గొని,బౌద్ధ విగ్రహానికి పూజలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వైశాఖ పూర్ణిమ లేదా బుద్ధ పూర్ణిమను నేపాల్, సింగపూర్, వియత్నా, థాయ్‌లాండ్, కాంబోడియా, మలేసియా, శ్రీలంక, మయన్మార్, ఇండోనేషియా, పాకిస్తాన్, భారత్ వంటి దక్షిణాసియాల ఆగ్నేయాసియా దేశాల్లోని బౌద్ధులు జరుపుకుంటారు. పేరుకు ఇది బుద్ధ జయంతి అని పిలువబడినప్పటికీ బుద్ధుడు జన్మించింది, జ్ఞానోదయం పొందిందీ, నిర్వాణం పొందిందీ ఒకే రోజున కావడంతో ఇది విశేషంగా గుర్తింపు పొందింది. మహాయాన బౌద్ధ సంప్రదాయాల ప్రకారం ఈ



పర్వదినాన్ని వైశాఖ పర్వదినంగా పిలుస్తుంటారు. భారత్‌లో దీన్ని మే 10న బుద్ధ జయంతి లేదా బుద్ధ పూర్ణిమ పేరుతో పిలుస్తుంటారు. పౌర్ణమి రోజున జరుపుకుంటూ ఉండటంతో దీనికి బుద్ధ పూర్ణిమ అని కూడా పేరు పడింది.

## ఏపీ 'పది'లో తూర్పుగోదావరి ఫస్ట్

**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. విశాఖ ఆంధ్రాయూనివర్సిటీలో మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ ఫలితాలను విడుదల చేశారు. మార్చి నెలలో జరిగిన పదో తరగతి పరీక్షలకు 6,22,538 మంది విద్యార్థులు హాజరుకాగా..5,60,253 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 91.92 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. గతేడాదితో పోలిస్తే 2.60 శాతం ఉత్తీర్ణత తగ్గినట్టు వివరించారు.

**బాలికలదే పైచేయి**

ఈ ఏడాది విడుదలైన ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా 97.97 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో నిలవగా.. చిత్తూరు 80.55 శాతం ఉత్తీర్ణతతో ఆఖరిస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 11,143 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4102 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాయి. సున్నాశాతం ఉత్తీర్ణత సాధించిన రెండు పాఠశాలలూ ప్రైవేటు పాఠశాలలే కావడం గమనార్హం. ఈ ఏడాది 18,227 మంది విద్యార్థులు 10 జీపీఏ పాయింట్లు సాధించినట్టు మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఫలితాల్లోనూ 91.97 శాతంతో బాలికలే పైచేయి సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 14 నుంచి జరుగుతాయన్నారు. రీవెరిఫికేషన్‌కు ఈ నెల 20 ఆఖరి గడువుగా నిర్ణయించారు. పరీక్షల్లో పాసైన విద్యార్థులకు మంత్రి అభినందనలు తెలిపారు.

## అధికారులు కష్టపడి పనిచేయాలి



**రా.వా.ప్రతినిధి,జాకీర్-గుంటూరు :** ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను జిల్లాలో పటిష్టవంతంగా అమలు చేయడంలో అధికారులు కష్టపడి పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోజుకు 2 లక్షల మంది పనివారలు హాజరవ్వడమే లక్షంగా అధికారులు పనిచేయాలన్నారు.లక్ష్యాన్ని సాధించాలంటే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులు,సిబ్బంది కష్టపడి పనిచేస్తే మంచి ఫతితాలు సాధించి ప్రజల మన్ననలు పొందండి అని అన్నారు. గ్రామాల్లో సిమెంటు రహదారులు,అంగన్ వాడీ భవనాలు,గృహాల నిర్మాణం వంటి. కార్యక్రమలను పకడ్బందీగా చేపట్టాలన్నారు.పనులను వేగవంతం చేసి లక్ష సాధనకు కృషి చేయాలన్నారు.ఉపాధి హామీ పథకం,నీరు-ప్రగతి కార్యక్రమాలపై ప్రతి వారం మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని చెప్పారు.మండల స్థాయిలో అభివృధి కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యత మండలం అభివృద్ధి అధికారులదేనని వారి బృందాలు ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకట సుబ్బయ్య, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పులి శ్రీనివాసులు,వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, మండల సరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ కేటాయింపు కమిటీలోకి లోకేష్



**రా.వా ప్రతినిధి- అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనయుడు పంచాయతీరాజ్ శాఖ, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు రోజు రోజుకు ప్రాధాన్యత పెరిగిపోతుంది. తాజాగా ఆయన్ను రాజధాని భూకేటాయింపు కమిటీలో చోటు కల్పిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందే మంత్రుల కమిటీని తాజాగా పున:వ్యవస్థీకరించింది. రాజధాని భూముల కేటాయింపు వ్యవహారంలో రాజధానిలో ఏ సంస్థకు అయిన ఏ వ్యక్తికైనా భూములు కేటాయించాలంటే క్యాబినేట్ కంటే ముందు మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయిస్తుంది. ఈ మంత్రి వర్గ ఉపసంఘాన్ని సీఎం చంద్రబాబు తన కుమారుడి కోసం కొత్తగా పున:వ్యవస్థీకరించారు. జీఓ నెంబర్ 993ను జీఏడీ జారీ చేసింది. రాజధాని భూముల కేటాయింపుపై మంత్రులు యనమల రామకృష్ణుడు, నారాయణ, నక్కా ఆనందబాబుతో పాటు లోకేష్‌ను కూడా నిర్ణయించారు. వాస్తవానికి మంత్రి లోకేష్‌ను ఈ రాజధాని వ్యవహారాలకు అసలు ఎలాంటి సంబంధం లేదు. ఆయన శాఖ పంచాయతీరాజ్, ఐటీ శాఖ. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిని ఈ కమిటీలో వేయండం సచివాలయంలో హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం చంద్రబాబు తన కుమారుడి కోసం అక్కడ అన్ని వారి కనుసన్నల్లో జరగాలని ఇలా చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

## చైత్యన గోదావరి బ్యాంకు ప్రారంభం



**రా.వా ప్రతినిధి- రాయపూడి :** నగదు రహిత లావాదేవీలతో సమయం ఆదాఅవుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాయపూడిలోకొత్తగా ఏర్పాటైన ఈ భవనాన్ని మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. గతంలోనే శాఖ ప్రారంభమైనప్పటికీ లాకరు, ఇతర సౌకర్యాలతో నూతన భవనంలో బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పత్తిపాటి మాట్లాడుతూ, బ్యాంకు సేవలను ప్రతి పౌరుడు వినియోగించుకోవాలన్నారు. ఖాతాదారులకు బ్యాంకులు ఉత్తమ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం భవానీ శంకర్, బ్రాంచి మేనేజర్ మహమ్మద్ హసన్‌ఖసాని, ఖాతాదారులు పాల్గొన్నారు.ఖాతాదారుల సౌకర్యార్థం విశాలమైన భవనంలోకి మారామని బ్యాంక్ మేనేజర్ ఎం.హెచ్. కాషాని తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు ఛైర్మన్‌ని బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. అతిథిగా నాబోర్డు డి.జి.యమ్. డా॥ ఎ.వి. భవానీ శంకర్ పాల్గొన్నారు. ఆధునిక సదుపాయలతో స్ట్రాంగ్ రూమ్, లాకర్ సదుపాయాలు కల్పిస్తున్నాం. అవి బ్యాంకు మేనేజర్ కాషాని పేర్కొన్నారు. ఈ భవనం సుమారు 1400 చ.అ.లతో బ్యాంకు ఉద్యోగులకు క్యూబికిల్స్ లోపాలు, ఖాతాదారులు కూర్చునేందుకు సదుపాయాలు కల్పించి ఉత్తమ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ మల్లెల హరీంద్రనాథ్ చౌదరి, గ్రామ సెక్రటరీ గాదె వెంకటప్పయ్య, స్థానిక టీడీపీ నేత వెంకటేశ్వరరావు, రాయపూడి, లింగాయపాలెం నుండి ఖాతాదారులు పాల్గొన్నారు.




గన్నవరం విమానాశ్రయంను అంతర్జాతీయ హోదాగా ఇస్తు ప్రకటన విడుదల చేసిన కేంద్రం

## ఏ రోడ్డు ఎప్పుడు కుంగునో...

**రా.వా.ప్రతినిధి-విజయవాడ (వన్‌టౌన్) :** వన్‌టౌన్ పరిధిలో పుష్కరాల సమయంలో వేసిన రోడ్లు వరుసుగా కుంగిపోతున్నాయి. నెలరోజుల వ్యవధిలో మూడు ప్రధాన రోడ్లలో ఒక్కసారిగా గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు.ఇటీవల గణపతిరావురోడ్డు పంజాసెంటర్ సమీపంలో సుమారు రెండు మీటర్ల విస్తర్ణంలో రెండు అడుగుల మేర కుంగిపోయింది. ఆ తర్వాత రాజారాంగయ్య అప్పరావువీధిలోని రోడ్డు కుంగి ఇసుకు ట్రాక్టర్ ఇరుక్కుపోతుంది.తాజాగా బుధవారం అర్ధరాత్రి 11.30గంటల సమయంలో కేటీరోడ్డు వాగు సెంటర్ సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు తక్కువగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయం నగర పాలక సంస్థ సిబ్బంది మరమ్మతులు చేశారు.

## షాదీఖానాలకు భూములు గుర్తించండి

**రా.వా.ప్రతినిధి,కరీముల్లా -విజయవాడ :** జిల్లాలో ఆరు మండలాల్లో మైనార్టీలకు మంజూరైన షదీఖానాలకు అవసరమైనా భూములు గుర్తించాలని తహశీల్దార్లకు కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలో మంజూరైన షాదీఖానాలు ఇతర వక్ఫ్ సమస్యలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పామర్రుకు రూ.25లక్షల మంజూరు చేశారని, దీనికి అవసర మైన 30 సెంట్ల భూమిని గుర్తించాలని పామర్రు తహశీల్దారును ఆదేశించారు.ఇబ్రహీంపట్నానికి రూ.25 లక్షలు మంజూరు కాగా, 30 సెంట్ల భూమి,జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామానికి రూ.15లక్షల మంజూరవగా, 20 సెంట్ల భూమిని,పెనుగంచిప్రోలు మండలం అనిగంట్లపాడు గ్రామానికి రూ. 15 లక్షలు, 20 సెంట్ల భూమిని, వత్సవాయికు రూ.15 లక్షలు, 20 సెంట్ల భూమిని, మచిలీపట్నానికి రూ.20 లక్షల మంజూరుకుగాను 30 సెంట్ల భూమిని తహశీల్దార్లు గుర్తించాలని ఆయన తెలిపారు. ఈ నెల ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో వివిధ మసీదులకు చెల్లించే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ని డీఆర్వో సి.హెచ్ రంగయ్య పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గంధం చంద్రుడు, డీఆర్వో సి.హెచ్ రంగయ్య,విజయవాడ,మచిలీపట్నం ఆర్డీవోలు డి.చక్రపాణి,పి.సాయిబాబా, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి గౌసియా బేగం,తశీల్దార్లు పాల్గొన్నారు.

# దక్షిణ ఆసియాకు భారత్ బహుమతి

- జీశాట్- 9 సక్సెస్
- ఇవి చారిత్రక క్షణాలు : మోడీ

**నెల్లూరు :** గగన వీధుల్లో తనకు ఎదురులేదని ఇస్రో అగ్రదేశాలకు చాటి చెప్పింది. 7 దేశాలకు లబ్ధిచేకూర్చే ప్రతిష్టాత్మక దక్షిణాసియా ఉపగ్రహం జీశాట్-9ను విజయవంతంగా ప్రయోగించింది. జీఎస్ఎల్వీ ఎఫ్ 09 వాహకనౌక ద్వారా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి 28 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీశాట్- 9 నింగిలోకి దూసుకెళ్లింది. 2,230 కిలోల బరువైన ఈ సమాచార ఉపగ్రహం తయారీకి ఇస్రో 235 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. మొత్తం ఈ ప్రాజెక్టుకు రూ.450 కోట్ల రూపాయలు వెచ్చించింది. 12 ఏళ్ళు పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది. ఈ ఉపగ్రహం ద్వారా భారత్ సహా దక్షిణాసియా దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులు లబ్దిపొందనున్నాయి.

38 వరుస విజయాలతో ఇస్రో విజయయాత్ర కొనసాగిస్తుంది. జీఎస్ఎల్వీ - ఎఫ్ 09 ద్వారా 2230 కిలోల బరువు కలిగిన ఉపగ్రహాన్ని నింగిలోకి విజయవంతంగా పంపారు. ఇప్పటివరకు ఈ సిరీస్‌లో అత్యధిక బరువు కలిగిన ఉపగ్రహాలను పంపడం ఇదే మొదటిసారి. అదేవిధంగా మే 30న జీఎస్ఎల్వీ మార్క్ -3 ప్రయోగాన్ని కూడా చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిఎస్ఎల్వి ఎఫ్09 కమ్యూనికేషన్ రంగానికి చెందిన ఉపగ్రహం. జూన్ 25న పీఎస్ఎల్సీ 3, ఆ నెలఖరులో జీఎస్ఎల్వి మార్కు-3 భారీ ప్రయోగాలకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. ఉపగ్రహ ప్రయోగ విజయాన్ని చారిత్రక క్షణాలుగా ప్రధాని మోడీ



పేర్కొన్నారు. మొదట్లో దీన్ని సార్క్ ఉపగ్రహంగా పేర్కొనాలని భావించినా పాకిస్తాన్ ఇందులో భాగస్వామ్యం అయ్యేందుకు నిరాకరించడంతో దక్షిణాసియా ఉపగ్రహమని నామకరణం చేశారు.

# లౌక్యంతో లవ్లీ ఫ్యామిలీ

**నోరూరించే ఘుమఘుమలు, ఖరీదైన భోజనబల్లపై మరింత అందంగా అమర్చిన వంటలు అమాంతం ఆకలిని పెంచేస్తాయనడంలో సందేహం లేదు. ఆ సమయంలో ఎంతో ఆశగా పేట్లోది నోట్లో వేసుకుంటే 'ఉప్పు'లేదను కొంది పరిస్థితి ఏంటి ? మెతుకు కూడా మింగలేం కదా... జీవితం కూడా అంతే అన్నీ ఉన్నా 'లౌక్యం' లేకపోతే నిస్సారంగా మిగిలిపోతుంది. లౌక్యం అంటే అడ్డమైన సరుకులు అంటకట్టే కార్పొరేట్ మార్కెట్ల సేల్స్‌మెన్‌షిప్ కాదు.. అలా అని వ్యక్తిగత అవసరాలకు మనుషుల్ని వాడుకొని వదిలేసే లౌక్యం కూడా కాదు. షుగర్ కోటెడ్ టాబ్లెట్లు... మనలోని అనారోగ్యాన్ని ఎలా దూరం చేస్తాయో అలాగే ఎదుటివారి లోపాలను సరిచేయడానికి కావాల్సిన చతురత, బుద్ధివికాసాన్నే లౌక్యం అంటారు.**

ఎదుటి వారికి మనకు కూడా పొరపచ్చాయలు లేని, ఆనందకర, ఆరోగ్యకరమైన స్నేహభావం కలుగుతుంది. ఇది ముఖ్యంగా కావాల్సింది కుటుంబంల్లోనే... ఎక్కెడెక్కడో మాట్లాడేటప్పుడు చాలా సంయమనం పాటిస్తాము కాని, ఇంట్లో మాత్రం అనవసరంగా ఎక్కడ లేని ప్రస్టేషన్లు వస్తాయి. నిజానికి ఇక్కడే మనం చాలా లౌక్యాన్ని పాటించాల్సి ఉంది. చాలా మంది భర్తలు బయటంతా ఎంతో వినమ్రంగా ప్రవర్తించి ఇంటికి రాగానే రంకెలు వేస్తుంటారు. చిన్న చిన్న విషయాలకే విసుక్కుంటూ, అరుస్తూ ఇంటి ప్రశాంతతను పాడుచేస్తుంటారు. నిజానికి ఇది ఏమాత్రం సరికాదు.అయితే ప్రస్తుతం భార్య,భర్తలు ఇద్దరు కష్టపడితేనేగాని పిల్లలకు చదువులు, అద్దెలు వగైరాలు కట్టుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటిపనులు కూడా కబుర్లు చెప్పుకుంటూ అందరూ కలిసి చేసుకుంటే ఆప్యాయతలు మరింత పెరుగుతాయనడంలో సందేహం లేదు.

నిన్నటి తరం ఆడవాళ్లు బయట కెళ్లిన మగాడు సవాలక్ష సమస్యలతో సతమతమవుతుంటారు కాబట్టి భర్తల అరుపులు, కేకలు పట్టించుకోకుండా సర్థుకుపోతూ, పిల్లలను కూడా గప్‌చుప్‌గా ఉంచేవారు. ప్రస్తుతం పిల్లల పెంపకం ఛాలెంజ్‌గా మారింది. మారుతున్న పోకడలు, పెరుగుతున్న వస్తువినిమయం, అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు వాళ్ల ఆలోచనా విధానాన్ని మార్చివేస్తుందనడంలో సందేహంలేదు. ఇలాంటి నేపథ్యంలో తల్లిదండ్రులిద్దరూ అపోహలకు, అహంకారానికి తావిస్తే పిల్లల జీవితాలు వ్యర్థంగా మారతాయి. అందుకే కుటుంబాన్ని పరిరక్షించుకునే బాధ్యత భార్యాభర్తల భుజస్కందాలపై ఉందని గుర్తించాలి.

ప్రసిద్ధ కవిగారు అన్నివిషయాల్లోనూ బాగానే ఉండేవారు కాని, ముక్కుమీద కోపం.ఆయన భార్య చతురోక్తుల్లో దిట్ట .వారికాపురం మేడపైన. ఒకరోజు కవిగారు ఏదో పనిమీద బయటకు వెళుతుండగా, మేడమీదకు నీళ్లబిందె మోసుకుంటూ భార్య మెట్లు ఎక్కుతోంది. త్వరగా వెళ్లే హడావుడిలో ఉన్న కవిగారు 'అడ్డగాడిద'లు ఎదురొస్తే నేను తప్పుకోను అన్నారు బింకంగా, బిందెడు నీళ్లు మోసుకుంటూ పైకెక్కుతుంటే ఇంతమాటంటారా అని ఆ మహా ఇల్లాలు ఆరున్నొక్కరాగం అందుకోలేదు. కోపంతో ముక్కుపుటాలు ఎగురవేయలేదు. ఆమె చిన్నగా నవ్వుతూ నేను తప్పుకుంటాను లెండి అంది అంతే...పాపం కవిగారు మారుమాట్లాడకుండా వెళ్లారని చెప్పనక్కర్లేదనుకుంటా...



మరో ఇంట్లో ఇల్లాలు పిల్లలకు టిఫిన్లుపెడుతూ, పతిదేవుడికీ క్యారేజీలు సర్థుతూ, కట్టవలసిన పిల్లల స్కూలు ఫీజులు, తేవలసిన సరుకులు గురించి చెబుతుండగా, సదరు భర్తగారేమో తీరిగ్గా పేపర్లో తలపెట్టి ఏదీ వినిపించుకోవడంలేదు. కోప్పడితే మొదటికే మోసం వస్తుందని ఓర్చుకుంటూ మళ్లీ అవే విషయాలను ఆమె ఏకరువు పెడుతుండగా,... భర్త ఇది విన్నావా మగవాళ్లకంటే ఆడవాళ్లు రెట్టింపు మాట్లాడతారట... అన్నాడు పేపర్‌లోంచి తల బయటకు తెస్తూ...అందుకామే నిజమేనండీ... అందిట...దీంతో ఆమె భర్త సంతోషించేలోపే... మరి ఏదీ ఒకసారి చెబితే మగవాళ్లకు అర్థం కాదుకదండీ అందుకే అలా రెట్టింపు మాట్లాడవలసి వస్తుంది అని రిటార్డిచ్చేసింది.

మరో ఇంట్లో భర్త మంచివాడే కాని, భార్యతాలూకూ బంధువులను తక్కువగా చూస్తారు... ఒక రోజు ఆయన బయటకు వెళుతుండగా, రెండు గాడిదలు కనిపించాయట.. వెంటనే భార్యను పిలిచి ఇంటికి చుట్టాలు వస్తున్నారు...చూడూ అన్నారట... రెండు గాడిదలను చూసిన భార్య పరిస్థితిని అర్థం చేసుకొని రండి..రండి అత్తయ్యగారూ ..మామయ్యగారు అందిట...భర్తమొహం ఎలా ఉండి ఉంటుందో మీరే ఊహించండి...

**రెచ్చిపోకుండా,గొడవలు పెట్టుకోకుండా, సమస్యను సున్నితంగా పరిష్కరించుకోవడమే లౌక్యం అంటే...** ఎందుకంటే కుటుంబంలో ఎప్పుడూ కలతలకు చోటియ్యకూడదు...వాటి మూలంగా పిల్లలు ఇబ్బంది పడకూడదు... అంతేకాని, నువ్వెంతంటే...నువ్వెంతని తల్లి ఉంటే..తండ్రి ఉండని, లేదంటే తండ్రి ఉంటే తల్లి ఉండని కుటుంబాలు కాదు ఉండాల్సింది. కొంచెం ఓర్పు..కొంచెం నేర్పు ఉంటే ప్రతి ఇల్లూ శాంతినిలయమే అవుతుంది. జీవితంలో అనుకోని సంఘటనలు జరిగి

**ఓర్పుతో వ్యవహరించడం తాత్కాలికంగా కష్టంగా అనిపించవచ్చుగాని, జీవిత చరమాంకానికి చేరుకుని అనేక ఎత్తుపల్లాలను చూసిన అనుభవానికి వీరిది మంచి కుటుంబం అంటూ సమాజం ఇచ్చే తీర్పు గొప్ప రివార్డుగానే అనిపిస్తుంది.**

కుటుంబ భారం ఒక్కరిమీద పడేవారు తప్ప సింగిల్‌పేరెంట్స్ వ్యవస్థను సమాజంలో పెంచవద్దు. స్వేచ్ఛపేరుతో చిన్నచిన్న కారణాలకే భార్యాభర్తలు విడిపోతే...పసి హృదయాలు ఎంతగానో పరితపిస్తాయి... పెరిగి పెద్దయినా వారి హృదయాలు శూన్యంగానే ఉంటాయి. ప్రస్తుతం ఎవరికి ఎవరూ తీసిపోం అంటూ ఇగోలతో వేరైన తల్లిదండ్రుల మధ్య ఎదుగుతున్న పిల్లల మానసిక స్థితి దారుణంగా ఉంటుంది. **అమ్మదగ్గరకు వెళ్లాలంటే...అక్కడ సవతి తండ్రి ఉంటాడు... నాన్నదగ్గరకు వెళ్లాలంటే సవతి తల్లి ఉంటుంది...ఇబ్బందికరమైన పరిస్థితులు...చెప్పుకోలేని ఆత్మనూన్యత...**

ఒక్కటి మాత్రం నిజం... మంచి కుటుంబాన్ని అందించాలంటే మాత్రం భార్యాభర్తలు ఇద్దరూ కచ్చితంగా సర్థుకు పోవాల్సిందే... ప్రపంచంలో ఎన్నికోట్ల మంది ఉన్నా ప్రాథమిక ప్రాతినిధ్యం మాత్రం కుటుంబానిదే అని మర్చిపోకూడదు. వర్షం చినుకుపై వెలుగు కిరణం ప్రసరిస్తే ఏర్పడ్డ సప్తవర్ణ శోభిత ఇంద్రధనస్సులా ప్రతికుటుంబం విలసిల్లాలి...

**(దేశంలోవిడాకులు పెరుగుతున్నాయన్న వార్తకు స్పందనగా)**

**– జయ**



**మనం నివసించే ప్రదేశం సుఖసంతోషాలు వెల్లివిరియాలి. అప్పుడే అలసిన మనస్సులు సేదతీరతాయి. కుటుంబం మీద అనురక్తిని, అనుబంధాన్ని పటిష్టం చేస్తాయి.**

**పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చాం... అన్నది ముఖ్యంకాదు... ఎంత మంచి కుటుంబాన్ని ఇచ్చామన్నదే ముఖ్యం...జీవితంలో మానాన్న..మా అమ్మ.. మాచెల్లి..మా అన్న అని సగౌరవంగా సమాజానికి పరిచయం చేసుకునే కుటుంబం ప్రతి వ్యక్తికీ ఉండాలి.**

# జూలు విదిల్చిన తెలుగు సినిమా





**రావా డెస్క్ :** భారతీయ చిత్రపరిశ్రమలో ఏడాది ఎక్కువ సినిమాలు నిర్మితమయ్యేవి తెలుగు సినిమాలే అయితే అవన్నీ లెక్కపెట్టడానికే తప్ప రికార్డుల పరంగా ఎంతో నాసిరకంగా ఉండేవి. సింగపూర్,మలేషియాలాంటి దేశాల్లో కూడా ఆయన సినిమాలు బాగా వసూళ్లు చేసేవి. ఆతర్వాత అపరిచితుడు విక్రం, సూర్యాలు కూడా ఆయన సరసన చేరాలని చాలా తహతహలాడుతున్నారు. అయితే భారతీయ సినిమాలను కళాత్మకంగా దిద్దిన ఘనత, కుటుంబపరంగా అందరూ కలసి చూసేలా సినిమాలను రూపొందించింది కళాతపస్వి విశ్వనాథ్‌కాగా, సినిమాలను క్రమశిక్షణగా రూపొందిస్తూ విజయపరంపర కొనసాగిస్తున్నది మాత్రం బాహుబలి డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అని చెప్పక దప్పదు.

సినిమాలంటే హిందీవే... కలెక్షన్లంటే వాటివే అని దేశం యావత్తూ ఒక స్థిర అభిప్రాయానికి వచ్చిన నేపథ్యంలో తెలుగువాడి సత్తాచూపి దేశాన్ని దిమ్మెరపోయేలా చేసింది మాత్రం రాజమౌళి అండ్ ఫ్యామిలీ ... కృషితో నాస్తి దుర్భిక్షం అని సినిమా నిర్మాణాల్లోనూ నిరూపించాడు.. రాజమౌళి... ఒక మామూలు స్టోరీకి అసమాన్యమైన నగిశీలు చెక్కి అసాధారణంగా మలిచాడు..

ఇల్లుకట్టి చూడు, పెళ్లి చేసి చూడు.. అన్నారు పెద్దలు... ఇప్పుడు బాహుబలిలాంటి సినిమా తీసి చూడు అనాలేమో....సినిమాలోని ప్రతి ఫ్రేములోనూ ఆయన పడ్డ కష్టం కనిపిస్తుంది. ఐదేళ్లు ఒకే సినిమాకోసం కష్టపడటం అదే మైకంలో ఉండి సినిమాను నిలకడగా రూపొందించడం అనన్య సామాన్యం .. సుదీర్ఘకాలం సినిమా నిర్మాణంజరిగినప్పటికీ ప్రజలు దాని పట్ల ఆసక్తిని కోల్పోకుండా చేయడంలోనే చిత్రం విజయవంతమైందని చెప్పక తప్పదు..అయితే రేట్లు పెంచడం, విపరీతమైన హైప్ క్రియేట్ చేయడం ద్వారా బ్లాక్ టికెట్ల జోరు పెరిగి రూ. 2000 వరకు టికెట్ ధర పెంచడం దీంతో చోటామోటా నాయకులు దీన్ని స్వప్రయోజనాలకు వాడుకోవడం నివారించి గలిగి ఉంటే బాగుండేది... తాతమనవడు సినిమాతో కుటుంబ విలువలు కలిగిన సినిమాలకు రూపకల్పన చేసి, స్వర్గం–నరకం, ఒసేరాములమ్మతో తనకంటూ ఒక ఇమేజ్‌ను ఏర్పాటు చేసుకున్న దాసరి నారాయణరావుకు అల్లురామలింగయ్య అవార్డు రావడం ముదావహం. ఏది ఏమైనా మన తెలుగువారు ముగ్గురు జాతీయ అంతర్జాతీయంగా గుర్తింపు, గౌరవం పొందడం ముదావహం. మాస్ మసాలా జోలికి వెళ్లకుండా అచ్చమైన సంస్కృతిని ప్రదర్శించిన విశ్వనాథ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోగా, కలెక్షన్లపరంగా దూసుకుపోతున్న బాహుబలితో తెలుగువారు జూలు విదిలిస్తే హాలివుడ్‌కు కూడా జలక్ అని చెప్పకనే చెప్పారు...

**– బోస్**





### కోటిమందికి విద్యాదానం చేసిన

# ఉస్మానియా శతదినోత్సవాలు

హైదరాబాద్ నవాబులు చార్మినార్, ఛౌముహల్లా, ఫలక్‌నూమా ప్యాలెస్‌లాంటి అందమైన మహళ్లేకాదు.. విద్యా,వైద్యానికి కూడా అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందులోభాగంగా నిజాం నాలుగవ నవాబు మీర్ ఫరూఖ్ అలి ఖాన్ 1846లో ఉస్మానియా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. మీర్ ఉస్మాన్‌అలీ ఖాన్ తండ్రి మీర్ మెహబూబ్ అలిఖాన్ నిజాంకాలేజీ (1887)లో ప్రారంభించగా, పీజీకాలేజ్ ఆఫ్‌లా (1899)లో ఏర్పాటు చేశారు. ఆధునికవిద్యకు ఆధ్యుడిగా మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ నిలిచారు.

అంతకు ముందు విద్యాబోధన పర్శియా, ఉర్దూల్లో జరుగుతుండగా, మీర్ ఉస్మాన్ హయాంలో ఉర్దూ, ఆంగ్ల మీడియాకు ప్రాధాన్యత ఇచ్చారు. 1918లో ఉస్మానియా వర్సిటీ ప్రారంభించేంతవరకు నిజాంకాలేజీ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌కు అనుబంధంగా ఉండేది. ఇంగ్లీషు, తెలుగు, కన్నడ,మరాఠీ రాష్ట్రాల నుంచే కాకుండా దేశం యావత్తు నుంచి విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల్లో కలిపి 62 రకాల సబ్జెక్టులలో విద్యాబోధన జరుగుతోంది. భాగ్యనగరం నడిబొడ్డన 1600 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉస్మానియా తన అపూర్వ విద్యాయాత్రకు కొనసాగిస్తోంది. దీనికి 664 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏడు కాలేజీలున్నాయి. బాలికలకు, బాలురకు ప్రత్యేక హాస్టల్స్ ఉన్నాయి.

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు, కేంద్రంలో పలు కేబినేట్ శాఖలు నిర్వహించిన ఎస్.జైపాల్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) చిట్టచివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి... ఇంకా ఎంతో మంది రాజకీయవేత్తలు, భారత్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్, అంతర్జాతీయస్థాయి క్రికెట్ క్రీడా వ్యాఖ్యాత హర్షా భోగ్లే, క్రీడారంగ మేధావులు, రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ వేణుగోపాలరెడ్డి ,భారత తొలి వ్యోమగామి రాకేశ్‌శర్మ మరెందరో అత్యంత సుప్రసిద్ధ ఉస్మానియా విద్వవిద్యాలయం 'అ'పూర్వ విద్యార్థులు. ఇంకా ఈ ప్రతిభా పరంపర కొనసాగుతూనే ఉంది. హైదరాబాద్ సంస్థాన చరిత్రలో సర్ సాలార్ జంగ్ సమర్ధవంతుడైన పాలనాధికారిగా గుర్తింపును పొందారు. ఆయన హయాంలోనే ఆధునిక విద్యా పవనాలు హైదరాబాద్‌ను ఆవరించాయి. ఉస్మానియా ఆవిర్భావానికి నాటి హోంశాఖ కార్యదర్శి సర్ అక్బర్ హైదరీ ప్రత్యేకమైన చొరవ చూపించారు. 1917లో ఏప్రిల్ 26న ఒక 'ఫర్మానా' జారీ అయింది. ఈ ఫరానా ద్వారా విశ్వవిద్యాలయం ప్రారంభమైంది. మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన వెంటనే ప్రారంభమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రపంచశాంతికి భూమికను పోషించింది.

**భవన నిర్మాణాల్ని తీర్చిదిద్దిన నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్**

ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్మాణం విషయంలో 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ చూపిన శ్రద్ధ అమోఘం. ఎర్రటి ఎండలో నిలబడి విశ్వవిద్యాలయ భవన నిర్మాణాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించేవారు. అద్భుత కళానైపుణ్యానికి ప్రతీకగా ఆర్ట్స్ కళాశాల భవన నిర్మాణం జరిగింది. దీనిని దేశంలోనే అత్యంత అద్భుతమైన రూపంతో చారిత్రాత్మక కట్టడం ఆయన తీర్చిదిద్దారు. విశ్వవిద్యాలయం స్థాపించిన కాలంలో హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రదేశాలలో తరగతులు కొనసాగేవి. అయితే కళాశాల సముదాయం ఒకేచోట ఉండాలని నిజాం నవాబు నిర్ణయించారు. విశాలమైన ప్రాంగణంలో ఈ భవనాలన్నీ తీర్చిదిద్దినట్టు ఉండాలని భావించారు. 1934వ సంవత్సరంలో విశ్వవిద్యాలయం ప్రస్తుతం ప్రాంగణంలోకి మారింది. అబిడ్స్‌లోని గన్‌ఫౌండ్రీలో ఇంటర్మీడియట్ నైట్ క్లాసులతో మొదటి ఈ విశ్వవిద్యాలయం ప్రారంభమైంది. 1923 జులై 5న ఆర్ట్స్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 1939 డిసెంబర్ 4న ప్రారంభమైంది. విజన్ ఆఫ్ ఉస్మానియాగా ఆర్ట్స్ కాలేజీ నమూనా రూపకల్పన జరిగింది. ఆనాడే దీని నిర్మాణానికి రూ.36 లక్షలు ఖర్చుయింది. ఆర్ట్స్ కాలేజీలో ప్రస్తుతం 25 విభాగాలున్నాయి. ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణం మరో అద్భుతం. యూనివర్సిటీ విత్ పొటెన్షియల్ ఎక్సలెన్స్ ఇంకో విశిష్టమైంది. తొలుత ఆర్ట్స్ కళాశాల, తరువాత ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ తదితర విభాగాల భవనాల నిర్మాణం పూర్తి అయింది. దేశంలోనే అతిపెద్ద గ్రంథాలయాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం లైబ్రరీ ఒకటి. 1925లో స్నాతకోత్సవ విద్య, 1938లో పిహెచ్‌డి పరిశోధన ఆరంభమయ్యాయి. తొలుత అగ్రికల్చర్ (వ్యవసాయం), వెటర్నది (పశువైద్యశాస్త్రం) విభాగాలు కూడా యూనివర్సిటీ భాగంగా ఉండేవి. ఓయూ క్యాంపస్ కాలేజీల ఏర్పాటు జరిగింది.

నాణ్యత ప్రమాణాలతో కూడిన చదువు...ఉద్యమం...రెండూ ఉస్మానియా చరిత్రలో కలికితురాళ్ళుగా నిలిచిపోతాయి.ఉస్మానియా అంటేనే ఉద్యమాలకు నెలవు.విద్యాబుద్దులు నేర్పడమేకాదు కాకలు తీరిన రాజీకీయ నాయకులగా కూడా విద్యార్థులను తీర్చిదిద్దుతోంది.వందేళ్లలో ఎన్నో ఉద్యమాలకు,పోరాటలకు ఊపిరులూదింది.తాజాగా తెలంగాణ సాధన పోరులో కీలకపాత్ర పోషించింది.అన్నీ రంగాల్లోనూ అత్యున్నత స్థానాల్లో ఉస్మానియా పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో అలరారుతున్నారు.ఎందరో ఉత్తమ పౌరులను,ప్రముఖలను ఉస్మానియా సమాజానికి అందించింది. 47 మందికి గౌరవ డాక్టరేట్లు పురస్కారాలను ప్రదానం చేసింది. నవాబ్ ఇమాదుల్,విశ్వకవి రవీంధ్రనాథ్ ఠాగుర్, తొలిరాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్,మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్,తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్,మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తదితరులు గౌరవ డాక్టరేట్లు పొందిన వారిలో ఉన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు కూడా గౌరవ డాక్టరేట్ ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తోంది.దేశంలో అత్యంత పురాతనమైన విశ్వవిద్యాలయాల్లో 7వ స్థానాన్ని,దక్షిణాదిలో మూడవ స్థానాన్ని,దక్షిణాదిలో మూడవ స్థానాన్ని ఉస్మానియా పొందింది.

**– హుస్సేన్ ఖాన్**

## పరిశోధనలో నెంబర్ వన్

పరిశోధనలోనూ మేటిగా నిలుస్తోంది. 1926లోనే తొలి పరిశోధనా పుస్తకాన్ని ఆవిష్కరించిన ఘనత సొంతం చేసుకుంది. ఉన్నత విద్యలో ఉర్దూ భాష ఆవశ్యకతపై తొలి పరిశోధన జరిగింది. ఇంత వరకు 45 వేల పరిశోధనా పత్రాలను రీసెర్చ్ స్కాలర్‌లు సమర్పించారు. 7.800 పరిశోధనా పత్రాలు ప్రపంచ ప్రఖ్యాత చెందిన స్కోపస్ డేటా బేస్, రిబ్‌ఆఫ్ సైన్స్ డేటా బేస్‌లో నిక్షిప్తమయ్యాయి. ఈ 7,800 అంతర్జాతీయస్థాయి పరిశోధనలో ఇంత వరకు 5500 సైటేషన్స్‌ను సాధించడం హర్షించదగ్గ పరిణామం. ఉస్మానియాకు ఇప్పటి వరకు 24 మంది ఉపకుపతులుగా వ్యవహరించారు. ఇటీవల ప్రకటించిన జాతీయ ర్యాంకింగ్స్ జాబితాలో అత్యుత్తమ విద్యా సంస్థల్లో ఉస్మానియా 23వ స్థానంలో నిలించింది. గతేడాది 33వ స్థానంలో ఉన్న ఉస్మానియా ఏకంగా పది స్థానాలకు ఎగబ్రాకింది.

## కోటి మందికి విద్యాదానం

వందేళ్ల సుదీర్ఘ చరిత్రలో కోటి మంది విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించిన ఘనత ఉస్మానియాది. దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా అలరారుతోంది. అపురూపమైన గ్రంథాలయం దీని సోంతం. దారుతుల్ మారిఫ్ (గంథాలయం) తలమానికంగా నిలుస్తోంది. లక్ష డాక్యుమెంట్లతో పాటు 5,33,858 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయంటే దీని విశిష్టతను అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు అలనాటి ఆపూర్వ తాళపత్ర గ్రంథాలు కూడా ఉన్నాయి. డిజిలైజేషన్ ప్రక్రియతో వీటిని భద్రపరిచారు. 6835 మాన్యువల్ స్క్రిప్ట్స్ కూడా అంతేకాదు 45 వేల పుస్తకాలను డిజిటలైజ్ చేశారు. ఏడాదిలో కేవలం ఆరంటే ఆరు రోజులు మాత్రమే గ్రంథాలయానికి సెలవు దినాలు కావడం ఈ గ్రాంథాలయ ప్రత్యేకత.

## సమస్యల వలయంలో...

ఉస్మానియా విశ్వవిద్యాయలం క్రమంగా సమస్యల వలయంల చిక్కుకుపోతోంది. ప్రత్యేకించి నిధుల లేమితో పాటు ఆధ్యాపకుల కొరత వేధిస్తోంది. అన్ని భాగాల్లో కలిపి 1260 మంది ఆధ్యాపకులు ఉండాల్సివుండగా, కేవలం 590 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. 2016లో 50 మంది రిటైర్డ్ కాగా, ఏడాది మరో 40 మంది పదవీ విరమణ చేయనున్నారు. 2018ఓనూ 40 మంది, 2019లోనూ 40 మంది రిటైర్మెంట్‌కు సిద్ధంగా ఉన్నారు. అధ్యాపకేతర సిబ్బందిలో కూడా చాలా ఖాళీలున్నాయి. తక్షణమే ఖాళీలను భర్తీచేయాలని చాలా కాలంగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు నిధుల లేమితో సతమతమవుతోంది. ఆధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బందికి వేతనాల కోసం రూ.30 కోట్లు అవసరమవుతాయి. కానీ ప్రభుత్వం రూ.19 కోట్లు మాత్రమే అందిస్తోంది. అంతర్గత వసరుల నుండి మిగిలిన మొత్తాలను విశ్వవిద్యాలయం అతికష్టం మీద సమకూర్చుకుంటోంది. కొన్ని హాస్టల్ భవనాలు చాలా పాతబడిపోయాయి. క్రమంగా అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తిరిగి పూర్వవైభవం సంతరించుకోవాలంటే భారీగా నిధుల కేటాయింపుతో పాటు ఆధ్యాపకుల కొరతను తీర్చాలని లేని పరిస్థితుల్లో విద్యాప్రమాణాలు మరింతగా పడిపోయే ప్రమాదముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## శాతాబ్ధి ఉత్సవాలు

శతాబ్ధి ఉత్సవాల ఏప్రిల్ 26,27, 28వ తేదీల్లో జరిగాయి. 26న ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రపది రాష్ట్రముఖ్యమత్రి కె. చంద్రశేషరరావు పాల్గొంటారు. ఎ గ్రౌండ్స్‌లో జిరిగే ఈ వేడుకల్లో 15 వేల మంది అహ్వానితులు పాల్గొన్నారు. సంవత్సరం పొడవునా శతాబ్ధి సంవత్సరాలు ఘనంగా నిర్వహించానున్నారు. విద్యా, పరిశోధన, సంస్కృతిక, క్రీడాకార్యక్రమాలను, తెలంగాణ సంస్కృతిని వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా వీటికి రూపకల్పన చేశారు. 27న తెలంగాణ– దేశ నిర్మాణంలో ఓయూ పాత్ర అనే అంశంపై సదస్సు. పూర్వ విద్వార్థుల సమ్మేళనంతో పాటునోబెల్ గ్రహీతల ఉపన్యాసాలుంటాయి. 'రాబోయే 50 సంవత్సరాలపై ఓయూ దృష్టి అనే అంశంపై చర్చాగోష్టి జరుగుతుంది. 2018 జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు 105వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ కుడా ఓయూలోనే జరుగుతుంది. ఈ ఉత్సవాల నిర్వహణకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.200 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రముఖ చిత్రకారుడు ఎల్. లక్ష్మిణ్ శతాబ్ధి ఉత్సవాల లోగోను రూపొందించారు.

## గీతామందిరంలో నటి భానుశ్రీ సందడి



**రా.వా.ప్రతినిధి,మచిలీపట్నం,వి.నాగేశ్వరరావు:** బిచ్చగాడు సినిమాలో నటించిన భానుశ్రీ గీతామందిరంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభించి సందడి చేసింది.మహిళలు, చిన్నారులు కరచాలనం చేసేందుకు పోటిపడ్డారు. కేవలం 10 రూపాలయలకే చీర అంటూ నిర్వాహకులు ఆఫర్ ప్రకటించడంతో మహిళల పెద్ద సంఖ్యలో వచ్చారు. వ్యాపారాన్ని తొలుత మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య ప్రారంభించారు.

**అభిమానం గుర్తుంచుకుంటా--నటి భానుశ్రీ**

మొదటి సారి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి మచిలీపట్నం వచ్చాను. మీరు చూపిస్తున్న అభిమానం గుర్తుంచుకుంటాను. అక్షయ తృతీయ రోజు రావటం సంతోషంగా ఉంది. బాహుబలి చిత్రాలతో పాటు తమిళ, కన్నడ చిత్రాలలో నటించాను. సౌత్ ఉండియా షాపింగ్ మాల్ నిర్వాహకులు 5వేలు కోనుగోలు చేస్తే వెండి గ్లాసు, 2 వేలు కొనుగోలు చేస్తే వెండి కుంకుమ భరిణ వంటి ఎన్నో ఆఫర్లు పెట్టడం మహిళల మీద ఉన్న గౌరవానికి నిదర్శనం. తనకు శారీస్ అంటే ఇష్టం అని భానుశ్రీ అన్నారు. రకరకాల చీరలు ప్రదర్శిస్తూ మీడియాకు ఎదురు ఫోటోలకు ఆసక్తి చూపారు.

## విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పేరుతో చెట్లు నరికివేత

**రా.వా.ప్రతినిధి-మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు:** పట్టణంలోని జగన్నాథపురం, బుట్టాయి పేట ప్రాంతంలో విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్య ధోరణి వలన పచ్చని చెట్లు అడ్డదిడ్డంగా నరికివేయడం, పాదాచారులకు తీవ్ర ఇబ్బంది కలగజేయడం పట్ల సీనీయర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తీవ్రంగా ఖండించారు. విద్యుత్ లైన్లు పురనుద్ధరణ పేరుతో ప్రజలు పెంచుతున్న చెట్లను ప్రేవేటు వ్యక్తులతో నరికి రోడ్డుపై పడవేయడంతో శుక్రవారం పాదాచారులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం పచ్చదనం -పరిశుభ్రత నినాదంను విద్యుత్ శాఖాధికారులకు పట్టక పోవడం ఖండించదగిన విషయం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఇందుకు కారణం. కేవలం విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న కొమ్మలు కాకుండా, చెట్లను దారుణంగా నరికి వేయడం పట్ల ప్రజలు విద్యుత్ శాఖను బహిరంగంగానే విమర్శించారు.

## బాలికలకు సైకిళ్ళ పంపిణీ



**రా.వా.ప్రతినిధి -మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు :** బాలికలు మధ్యలో బడి మానివేయకుండా విద్యను కొనసాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు అందజేస్తున్నట్లు రాష్ట్ర, న్యాయ, యువజన సంక్షేమం, క్రీడలశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం మంత్రి జార్జీకారనేషన్ హైస్కూల్‌లో, పట్టణంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో 9వ తరగతి చదివే బాలికలకు సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు 1.82 లక్షల సెకిళ్ళు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బందరు నిమోజక వర్గానికి సుమారు 900 సైకిళ్ళు వచ్చాయని, వీటిలో 650 సైకిళ్లు మండలాల్లో పంపిణీ మంత్రి తెలిపారు. బాలికలు విద్య పట్ల ప్రభుత్వం తగిన శ్రద్ద వహిస్తున్నదని, డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు మద్యాహ్నబోజన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సైబర్ నెట్ ద్వారా 149 రూలకే టివి చానల్స్ , ఇంటర్ నెట్, టెలిఫోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, జార్జికారనేషన్ స్కూల్ అధ్యక్షులు నారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నరశింహారావు. కౌన్సిలర్లు, ప్రసాద్, హేమకుసుమ, తిరుమల, మైనార్టి నాయకులు ఇలియాస్ పాషా, ఖాజాబేగ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతుల నష్టాలపై దృష్టి

**ఎంపీ పండుల రవీంద్రబాబు**



**రా.వా.ప్రతినిధి,కోనసీమ-జివిఎన్.రావ్ :** ఆక్వా చెరువుల వలన చేకూరే లబ్ధిపైనే కాకుండా ఆ చెరువుల కారణంగా సంభవించే నష్టాలపై కూడా ఆక్వా రైతులు దృష్టి పెట్టాలని అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు అన్నారు. గడియార స్తంభం సెంటర్‌లో ఆర్‌కేవీవై పథకం కింద రూ.10లక్షలతో మంజూరైన మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఆక్వా ల్యాబ్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలసి ఎంపీ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఆక్వాకల్చర్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీరు లోపలికి వచ్చి త్రాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, పర్యావరణానికి హానీ లేకుండా చూడాలని అన్నారు. త్రాగునీరు కలుషితం అయితే రాబోయే రోజుల్లో నీటి కోసం ఘర్షణపడే పరిస్థితులు వస్తాయన్నారు. అవసరమైతే తప్ప యాంటీ బయోటిక్స్ రసాయనాలు వాడవద్దని రైతులకు సూచించారు. హోంమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాలని, మొబైల్ ల్యాబ్‌ల ద్వారా ఆక్వా రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. మత్స్యశాఖ జాయింట్ డైరక్టర్ ఎస్.అంజలి మాట్లాడుతూ మొబైల్ ల్యాబ్ ద్వారా చెరువుగట్లపైనే నీటి నాణ్యతా ఆమ్ల, క్షార శాతాలను పరీక్షలు నిర్వహించి రైతులకు తగు సూచనలు, సలహాలు మత్స్యశాఖ బృందం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ ల్యాబ్ వలన డివిజన్‌లో పదిహేను మండలాల్లోని 8వేల మంది రైతులకు సంబంధించిన 10వేల హెక్టార్ల చెరువులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రాష్ట్రాన్ని ఆక్వా ల్యాబ్‌గా చేయడానికి 2017-18 సంవత్సరాలకు రాష్ట్రం మొత్తంమీద రూ.282కోట్లు మత్స్యశాఖ కేటాయించగా ఇందులో మన జిల్లాకు రూ.23కోట్లు కేటాయించడం జరిగిందని అంజలి అన్నారు. కార్యక్రమం అనంతరం బయోఫ్లాక్ టెక్నాలజీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జడ్పీ చైర్మన్ నామన రాంబాబు, డీజీపీ నందూరి సాంబశివరావు, మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, ఏరియా ఆసుపత్రి చైర్మన్ మెట్ల రమణబాబు, ఐజీ కుమార్ విశ్వజిత్, డీఐజీ రామకృష్ణ, దాట్ల బాబు, ఆర్డీవో జి.గణేష్‌కుమార్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దుగ్గిరాల యార్డుకు భారీగా పసుపు

**రా.వా.ప్రతినిధి-దుగ్గిరాల :**



గుంటూరు జిల్లా దుగ్గిరల పసువు మార్కెట్ యార్డులో మార్కుఫెడ్ ద్వారా కొనుగోళ్ళు ముమ్మరంగా సాగుతున్నాయి మార్కెట్ యార్డు చైర్మన్ వంగా సాంబిరెడ్డి ఆధ్వర్యంలోని కమిటీ పర్యవేక్షిస్తోంది. 2,405 బస్తాలు 1803 క్వింటాళ్ళు కొనుగోటు చేశారు. కొందరు రైతులు గ్రేడింగ్ చేయకుండా కల్లం నుంచి నేరుగా యార్డుకు తీసుకురావడంతో సరకు బయట ఆరబోసి గ్రేడింగ్ తరువాత కొనుగోలు చేయడం సమస్యగా మారిందని అధికారులు కోరుతున్నారు. రైతులు పసుపును గ్రేడింగ్ చేసి తీసుకురావాలని యార్డు అధికారులు కోరుతున్నారు. ప్రతిరోజు 23 వేల క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేయాలని అధికారులు పెట్టుకున్న లక్ష్యం నెరరడంలేదు యార్డులో సరకు భారీగా నిల్వ ఉన్నందున రైతన్నలు ఆలోచించి తీసుకురావాలని యార్డు సెక్రటరీ బ్రహ్మయ్య తెలిపారు. ఆరుబయట, గోడౌన్ల క్రింది సరుకు తరలించాలా వద్దా ముందుకు తెలుసుకోవాలన్నారు.

**మార్కెట్ యార్డులో హమాలీల కొరత**

మార్కెట్ యార్డులో పసుపు పోత కాటలు వేయడానికి ఎగుమతులు దిగుమతులకు హమాలీల కొరత తీవ్రంగా ఉందని యార్డు ఛైర్మన్ వంగాసాంబిరెడ్డి తెలిపారు. రోజు2,3వేల క్వింటాళ్ళు పసుపు కొనుగోలు చేస్తుండగా సుదూర ప్రాంతల నుంచి 5,6వేల క్వింటాళ్ళ సరకు వస్తుందన్నారు. లోడింగ్ అన్ లోడింగ్‌లో ఇబ్బందిగా ఉందన్నారు ఉదయం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు హమాలీలు పని చేయలేకపోతున్నారు.

## 'మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఏవి ?

**రా.వా ప్రతినిధి- అమరావతి :** మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని వంచిస్తున్నారని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇంటర్మీడియట్ చదివే ముస్లిం మైనార్టీ విద్యార్థికి రూ.8 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారని, ఇప్పుడు ఆ సొమ్మును రూ.1,420కి తగ్గించినా అది కూడా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలుగా స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో మైనార్టీ విద్యార్థులను ఇంటర్ కళాశాలలు ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నాయని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం చెబుతారని అన్నారు.

## రాయపూడిలో మేడే వేడుకలు

**రా.వా ప్రతినిధి- తుళ్ళూరు :** రాజధాని గ్రామమైన రాయపూడిలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏరియా రైతు సంఘం నాయకుడు చింతరాల కోటేశ్వరరావు జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాజధాని ప్రాంత నాయకుడు జీవీ రాజు మాట్లాడుతూ చికాగో నగరంలో 1886లో జరిగి ఘటన ఫలితంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు మేడే పండుగను జరుపుకుంటున్నారని తెలిపారు. పెట్టుబడి దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాల నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుల కే ఈశ్వరరావు, గుర్రం కొండ సత్యానందం, కంభంపాటి దేవునిదయ, పుట్ట నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పిండాల దొడ్డిని అభివృద్ధి చేయాలి



**రా.వా.ప్రతినిధి-మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు:** పిండాల దొడ్డి ఆక్రమణలు తొలగించి పిండాలదొడ్డిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని,తొలగించిన కట్టడాలు శిధిలాలు, చెట్లను తొలగించి, బోర్డును, దొడ్డి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పరచి, నీటి వసతి, విశ్రాంతి మండపం, అస్థికలు భద్రపరచుకునే ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్‌కు బీసి సంక్షేమం నాయకులు గడ్డం రాజు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.జయలక్ష్మీ, వి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రసాద్, ఆర్.చిన్ని, బోలెం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కల్కి అందరివారు
ఎం.బేగ్
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

# బంగినపల్లికి భౌగోళిక గుర్తింపు

**చెన్నై :** పండ్లన్నిటిలో మామిడి రారాజు అనేది అందరికీ తెలిసిన విషయమే. ఇక మామిడి పండ్లలో బంగినపల్లికున్న ప్రత్యేకత, దాని రుచి జగద్విదితం. ఈ బంగినపల్లి మామిడిపండుకు మరో అరుదైన గుర్తింపు దక్కింది. దీనికి జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ (జీఐ) ట్యాగ్ లభించింది. బంగినపల్లి మామిడికి జీఐ ట్యాగ్ ఇవ్వాలంటూ ఆంధ్రప్రదేశ్ నుంచి అందిన ధరఖాస్తును పరిశీలించిన చెన్నైల్లోని జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ రిజిస్ట్రీ జియో ట్యాగ్ మంజూరు చేసింది. అంటే ఈ పండు ఓ నిర్దిష్ట ప్రాంతానికి చెందినదనే గుర్తింపు లభించిందన్న మాట. దాదాపు వందేళ్ల నుంచి బంగినపల్లి మామిడిపండ్లు రాష్ట్రంలో పండుతున్నాయి. వీటిని బెనెషాన్, బనెషాన్, సఫేద అని కూడా పిలుస్తారు. మూడు నెలలపాటు కోల్డ్ స్టోరేజ్ ఉంచినా వీటి రుచి ఏమాత్రం



తగ్గదని రాష్ట్ర ప్రభుత్వం జీఐ దరఖాస్తులో పేర్కొంది, కర్నూలు జిల్లా జనగానపల్లె, పాణ్యం, నంద్యాల మండలాలను ఈ మామిడిపండ్లకు ప్రాథమిక మూల కేంద్రాలుగా తెలిపింది. రాయలసీమ, కోస్తాంధ్రతోపాటు తెలంగాణలోని ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, అదిలాబాద్ జిల్లాలకు కూడా వీటి మూల కేంద్రాలుగా పేర్కొంది. వీటి మూలాలకు సంబంధించి 'బనగానపల్లె – స్టేట్ మద్రాస్ వార్ ఫండ్ సీల్ వంటి చారిత్రక ఆధారాలను చూపింది. 2011 లో అప్పటిరాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ రాణి కుముదిని సమర్పించిన అఫిడవిట్ ప్రకారం... సుమారు 7,66 లక్షల కుటుంబాలు బనగానపల్లె మామిడిపండ్లను ఉత్పత్తి చేస్తున్నారు. సుమారు 5500 టన్నులకు పైగా మామిడిపండ్లను అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలకు ఏటా ఎగుమతి చేస్తున్నారు. బంగినపల్లి మామిడిపండ్ల వార్షిక టర్నోవర్ సుమారు రూ. 1,461 కోట్లు, రైతులకు మెరుగైన మార్కెట్ ధర లభించేందుకు జీఐ ట్యాగ్ ఉపకరిస్తుంది. మేథో సంపత్తి హక్కుల్లో జీఐ ట్యాగ్ కూడా ఒక భాగం.

## చట్టబద్ధంగా భూములు తీసుకోండి : మల్లెల శేషగిరిరావు



**రా.వా –ప్రతినిధి–రాయపూడి :** నూతన రాజధాని అమరావతి అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకంకాదని అయితే ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే కుదరదని రాయపూడి మాజీ సర్పంచి మల్లెల శేషగిరావు తెలిపారు. చట్టం ప్రకారం భూములు ఇచ్చేందుకు సిద్ధమని రాయపూడిలో జిరిగిన రైతు అభిప్రాయ సేకరణ సదస్సులో ఆయన మాట్లాడారు. రాజధాని రాకముందే 2011 లోనే భూములు విలువ రూ. కోట్లు చేరాయని, ఆ రేట్లుకు అనుగుణంగా రైతులకు విలువ చెల్లించి భూములు తీసుకోవచ్చని శేషగిరిరావు అధికారులతో చెప్పారు. చట్టం ప్రకారం భూములు ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. రైతులిచ్చిన భూముల్లో ఎలాంటి కట్టడాలు నిర్మిస్తారో,ఎందుకు తీసుకుంటాన్నారో ముందుగా తెలియజేయాలని ఆయన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

**ఐనవోలులో...** ఐనవోలులో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో రైతులు అధికారులపై ధ్వజమెత్తారు.గ్రమకంఠాలు ,గ్రామంలోని సమస్యలు తీర్చకుండా ప్రతిసారి సదస్సులు ఎందుకని ప్రశ్నించారు .తొలుత గ్రామసభకు హాజరుకాని రైతులు ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్ డైరెక్టరు బీఎల్ చెన్న కేశవరావు వచ్చాక రైతులు హాజరయ్యారు. గ్రామకంఠాల అంశాన్ని పరిష్కరించాలని రైతులు కోరారు.

# ఏపీకి స్వచ్ఛ ర్యాంకులు



- విశాఖ మూడు, తిరుపతికి తొమ్మిదో ర్యాంకు
- మొదటి స్థానంలో ఇండోర్
- 19 వ స్థానంలో విజయవాడ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా స్వచ్ఛత పాటించిన పట్టణాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ 2017 ర్యాంకులను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యానాయుడు విడుదల చేశారు. ఈ జాబితాలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం తొలి ర్యాంక్ సాధించింది. గత రెండు సర్వేల్లో తొలి ర్యాంక్ సాధించిన మైసూర్ ఈసారి ఐదో ర్యాంక్‌కే పరిమి తమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, తిరుపతి టాప్‌టెన్‌లో స్థానం సాధించాయి. విశాఖపట్నం 3 వ స్థానంలో,తిరుపతి 9 వ స్థానంలో నిలిచాయి. మొత్తం 434 పట్టణాలకు ర్యాంకులు విడుదల చేశారు. మొదటి పది స్థానాల్లో ఇండోర్,భోపాల్,విశాఖపట్నం, సూరత్,మైసూర్,తిరుచురాపల్లి, న్యూదిల్లీ మున్సిపల్ కౌన్సిల్, నవీ ముంబై,తిరుపతి,వడోదర ఉన్నాయి. టాప్–50లో గుజరాత్ నుంచి 12, మధ్యప్రదేశ్ నుంచి 11, ఆంధ్రప్రదేశ్ నుంచి 8 పట్టణాలు స్థానం సాధించాయి. ఈ మూడు రాష్ట్రాలు స్వచ్ఛభారత్‌లో గణనీయమైన ప్రగతి సాధించాయని కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు అన్నారు.

టాప్ 50లో తెలుగు రాష్ట్రాల నగరాలు

స్వచ్ఛ సర్వేక్షణ్–2017 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పట్టణాలు టాప్–50లో చోటు దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నం,తిరుపతి తొలి పదిస్థానాల్లో ఉండగా...... మరో ఆరు పట్టణాలు టాప్ 50లో ర్యాంకు సాధించాయి. తెలంగాణ నుంచి గ్రేటర్ హైదరాబాద్ 22 వ స్థానంలో నిలవగా...మరో మూడు పట్టణాలు టాప్–50 జాబితాలో స్థానం సంపాదించాయి.గ్రేటర్ హైదరాబాద్(22),వరంగల్(28),సూర్యాపేట్(3), సిద్దిపేట్ (45),ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ (19) తాడిపత్రి (31), నర్సరావుపేట(40), కాకినాడ(43), తెనాలి(44),రాజమండ్రి(46)

# మోడల్ పోలీస్‌స్టేషన్ భవన శంకుస్థాపన

**రా.వా.ప్రతినిధి,కోనసీమ–జీఎన్.రావ్ :** అమలాపురం గడియార స్తంభంలో రూ. 2కోట్లతో నూతనంగా నిర్మించే మోడల్ పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంశాఖా మంత్రి నిమ్మకాయల చినరాజప్ప డీజీపీ నండూరి సాంబశివరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి రాజప్ప మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రస్తేక్తిలేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లల్లోను మోడల్ పోలీస్ స్టేషన్లు నిర్మిస్తామని, అమలాపురంలో రూ. 4కోట్లతో 2 ఎకరాల విస్తీర్ణంలో జైలు నిర్మాణం చేపడతామని అన్నారు. అలాగే అగ్నిమాపక కేంద్రాన్ని కూడా నిర్మిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర డీజీపీ నండూరి సాంబశివరావు మాట్లాడుతూ అమలాపురంలో ఉపముఖ్యమంత్రి సూచనల మేరకు ఒక బెటాలియన్‌ను త్వరలో ఏర్పాటుచేస్తామని అత్యవసర సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ఈ బెటాలియన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రస్తుతం నిర్మించే మోడల్ పోలీస్ స్టేషన్‌ను మూడు నెలల్లో నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ వ్యక్తులు శాశ్వతం కాదని పనులే



శాశ్వతమని నమ్మిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని, కోట్లాది రూపాయిలు వెచ్చించి అమలాపురం పురపాలక సంఘ పరిధిలో డ్రైన్లు, రహదారులు, రక్షిత మంచినీటి సదుపాయాలు వంటి అనేక అభివృద్ధి పనులు ప్రభుత్వ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పండుల రవీంద్రబాబు, పి.గన్నవరం ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి, జడ్‌పీ చైర్మన్ నామన రాంబాబు, ఐజీ కుమార్ శ్వీజిత్ర, డీఐజీ రామకృష్ణ, రాజమండ్రి అర్బన్ ఎస్‌పీ బి.రాజకుమారి, మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, ఏరియా ఆసుపత్రి చైర్మన్ మెట్ల రమణబాబు, వైఎస్ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక నల్లవెంతన దిగువన ఉన్న ఎన్‌టీఆర్ మార్గ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన కార్తికేయ విగ్రహాన్ని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప డీజీపీ నండూరి సాంబశివరావు, ఎంపీ పండుల రవీంద్రబాబులతో కలసి ప్రారంభించారు.

తూర్పుగోదావరి జిల్లా అల్లవరంలో సుమారు రూ. కోటితో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంశాఖామంత్రి నిమ్మకాయల చినరాజప్ప రాష్ట్ర డీజీపీ నండూరి సాంబశివరావు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీజీపీ నండూరి సాంబశివరావు మాట్లాడుతూ పోలీసుల పనితీరు బాగుండాలని, సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ సామరస్యంగా మెలగాలని సూచించారు. మోడల్ పోలీస్ స్టేషన్లకు ధీటుగా అల్లవరం పోలీస్‌స్టేషన్‌ను నిర్మించారని అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో వంద మోడల్ పోలీస్‌స్టేషన్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నండూరి సాంబశివరావు అన్నారు.

## సహకార వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు : హోంమంత్రి రాజప్ప



**రా.వా.(ప్రతినిధి,కోనసీమ–జీఎన్.రావ్) :** సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. అమలాపురం పట్టణంలోని స్థానిక కృష్ణారావు వీధిలో రూ. 51లక్షలతో నూతనంగా నిర్మించిన డివిజనల్ సహకార అధికారి కార్యాలయం 'సహకార సదన్'ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి రాజప్ప మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు అందజేయడంలో వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలపై రాయితీ ఉండేదని ఏకారణంచేతనో తీసివేయడం జరిగిందని దానిని పునురుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## ప్రపంచ హోమియో సదస్సుకు నలుగురు వైద్యులు ఎంపిక



**రా.వా.(ప్రతినిధి,కోనసీమ–జిన్.రావ్) :** హోమియో వైద్య పితామహుడు హానీమన్ పుట్టిన దేశం జర్మనీ. ఈ దేశంలోని లిప్‌జిక్ నగరంలో జూన్ 14 నుండి 17 వరకు 4 రోజుల పాటు జరిగే 70 దేశాల హోమియో వైద్యప్రతినిధులు, పరిశోధకులు పాల్గొనున్నారు. 72వ ప్రపంచ హోమియో వైద్య సదస్సుకు మన రాష్ట్రం నుండి నలుగురు వైద్యులు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని 13 మంది ప్రముఖ హోమియో వైద్యులు స్థాపించిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ హోమియోపతి (ఐపిహెచ్)కి చెందిన నలుగురు వైద్యులకు ప్రపంచ హోమియో సదస్సు ఈ ఏడాది జనవరి 31న ఆహ్వానం పంపించింది. ఈ సదస్సులో 30 నిముషాల పాటు పోస్టర్ ప్రజంటేషన్, పరిశోధన పత్రాల సమర్పణ, హోమియో వైద్యంలోని వివిధ ప్రక్రియలపై చేసిన అధునాతన అధ్యయనంపై ప్రసంగించాలని కోరుతూ ప్రపంచ సదస్సు నుండి వీరికి వర్తమానం అందింది. అమలాపురం వేదికగా పనిచేసే ఐపిహెచ్‌లో వైద్య సభ్యులైన డాక్టర్ బిఎస్.మోహన్ (అమలాపురం), డాక్టర్ కృష్ణారావు (విజయవాడ), ఐ.శ్రీనివాస్ (నరసారావుపేట), శ్రీనివాసబాబు (విజయవాడ) ఈ ప్రపంచ సదస్సుకు వెళ్ళనున్నారు. అమలాపురంలోని ఐపిహెచ్ కార్యాలయం విజయ హోమియో క్లీనిక్‌లో డాక్టర్ మోహన్ అధ్యక్షతన ప్రపంచ సదస్సుకు వెళ్లే అంశంపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో హోమియో వైద్య ప్రొఫెసర్ డాక్టర్ సి.పి.సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐపిహెచ్ వైదికగా 13 మంది హోమియో వైద్యులు దాదాపు 3 దశాబ్దాలుగా హోమియో వైద్యాన్ని కాలానుగుణంగా వస్తున్న వ్యాధులకు అనుసంధానం చేస్తూ పరిశోధనలు జరపడం అభినందనీయమని డాక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.

## అమలాపురం చాంబర్ అధ్యక్షుడిగా గోకరకొండ



**రా.వా.ప్రతినిధి,కోనసీమ –జిన్.రావ్ :** ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా గోకరకొండ హరిసూర్య వరప్రసాద్(హరిబాబు) రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమలాపురం టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్‌లోని 23 సంఘాల ప్రతినిధులు పాత కమిటీనే యధాతథంగా కొనసాగించాలని కోరడంతో కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడు అల్లాడి స్వామినాయుడు, గౌరవ కార్యదర్శి వంకాయల కాశీ విశ్వేశ్వరరావు, గౌరవ సలహాదారు కర్రి బుద్ధేశ్వరరావుల అధ్వర్యంలో చాంబర్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చాంబర్‌లో 23 సంఘాలతో పాటు మరో నాలుగు సంఘాలు కలిశాయి.

# ఈవీఎంలతో ప్రజాస్వామ్యం పరిహాసం

ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లోనే కాదు, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ హవా అప్రతిహతంగా కొనసాగింది. ఇదివరకటి కంటే ఎక్కువసీట్లను నమోదు చేసుకుంటోంది. గత సార్వత్రిక ఎన్నికల హామీలైన 100 రోజుల్లో విదేశీ నల్లధనాన్ని తెచ్చి ప్రతిపేద కుటుంబాల్లోని వ్యక్తుల, ఖాతాల్లో వేస్తామని, రైతులకు రెట్టింపు లాభాలు, ఉద్యోగాల కల్పనలను నెరవేర్చడంలో బీజేపీ ఘోరంగి విఫలంచెందింది. అంతేకాదు పెద్దనోట్ల రద్దు పేరుతో ప్రజలజీవితాలను అతలాకుతలం చేసింది. అయినా ప్రధాని మోడీపై అచంచల విశ్వాసంతో ఓట్లు వేస్తున్నారని బీజేపీ చంకలు గుద్దుకోవడం సామాన్యుల దగ్గర నుంచి మేథావుల వరకు అనుమానాలను కలుగచేస్తోంది. **130 కోట్ల మంది భారతీయుల సమక్షంలోనే రెండు రాష్ట్రాల్లో (గోవా, మణిపూర్) ల్లో బీజేపీ ఆధిక్యత లేకపోయినా నిసుగ్గుగా ప్రభుత్వాలు ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో విపక్షాలు ఆరోపిస్తున్న ఈవీఎంల టాంపరింగ్‌ను తేలిగ్గా తీసుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని మరువరాదు....**

నిజానికి యంత్రాలు బాగానే పనిచేస్తాయి.. అయితే దాని వెనుకున్న వ్యక్తుల దుర్బుద్ధిని మాత్రం ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉండాలి. మహారాష్ట్రలో స్థానిక ఎన్నికలలో ఈవీఎంలపై మరిన్ని ఆరోపణలు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థికి ఒక్క ఓటు కూడా పడలేదు. 'కనీసం నా ఓటైనా నాకు రావాలి కదా' అని అతను వాదించాడు. పంచవటిలో అభ్యర్థుల ఓట్లన్నీ కూడితే పోలైన ఓట్ల కంటె ఎక్కువగా వచ్చాయి. 2 లక్షల ఓటర్లున్న నియోజకవర్గంలో 90 వేల మెజారిటీతో ఓ అభ్యర్థి గెలవడం వంటివి నమ్మశక్యంగా లేవని కొందరు వాపోయారు. ప్రతి సాఫ్ట్‌వేర్‌లోను ఏదో ఒక లోపం కనిపెడుతున్నారు హ్యాకర్లు. మరి ఈవీఎంలు మాత్రం అంత పక్కాగా వుంటాయా? అన్న సందేహాలు రావడంతో ఎన్నికల కమిషన్ 2019 పార్లమెంటు ఎన్నికల సమయానికి వీవీపీఏటీని ఎటాచ్ చేసింది. అంటే మనం ఎవరికి ఓటేశామో ఒక చీటీ వస్తుందన్నమాట. అదెలా పనిచేస్తుందో




చూపించడానికి మధ్యప్రదేశ్‌లో అప్పటికి 10 రోజుల్లో ఉపఎన్నిక జరపబోతున్న భిడ్‌లో మార్చి 31న మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా ముందు మధ్యప్రదేశ్ చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ సలీనా సింగ్ ఈవీఎంలో కొన్ని పార్టీలకు ఓటేసి, దానికి ఎటాచ్ చేసిన వీవీపీఏటీ నుంచి ప్రింటవుట్ తీసి చూపించారు.

ఆ ప్రింటవుట్‌లో బీజేపీ గుర్తుకే చాలా ఓట్లు పడ్డాయి. అంతేకాదు ఈవీఎంలో ఏ పార్టీకి మీట నొక్కినా, ప్రింటవుట్‌లో మాత్రం బీజేపీయే వస్తోంది. దీంతో అంతా బిత్తరపోయారు. సలీనాకు ఏంచేయాలో పాలుబోలేదు. 'ఈవీఎంలకు బీజేపీ పక్షపాతమున్నట్లుందే' అని ఒక విలేకరి చమత్కరించాడు. 'ఇదిగో యీ విషయం మీరు పేపర్లో రాశారో, మీ అందరినీ నేను పోలీసు స్టేషన్లో చూడాల్సి వస్తుందన్న ఆవిడ హెచ్చరికతో సహా మర్నాటి పేపర్లలో వార్త వచ్చేసింది. ఏ మీట నొక్కినా అన్నీ కమలానికే వెళ్లడం చేతనే బీజేపీ అంత మెజారిటీతో గెలిచిందని పుకార్లు వ్యాపించాయి. అయినా భారతీయ ఈవీఎంలు టాంపరింగ్ ప్రూఫ్ అంటూ ఇంకా ఎన్నికల సంఘం నమ్మబలుకుతోంది. ఓటర్లు ఎవరికి ఓటు వేశారన్నదానిపై ఓటింగ్ పేపరు ఆడిట్‌కోసం ప్రయోగించినప్పుడు బీజేపీ స్లిప్పులు మాత్రమే దొరికాయి. యంత్రాల సాంకేతిక మెళుకవలు ద్వారా ఓటింగ్ సరళిని మార్చవచ్చని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. భారతీయ ఈవీఎంలను హ్యాక్ చేసేందుకు అమెరికా శాస్త్రవేత్తలు మిచిగాన్ వర్సిటీలో ఒక మెషీన్‌ను అమర్చారు. ఇది మన దేశంలోని ఈవీఎంలలోకి చొచ్చుకుపోయి మొబైళ్ల ఆపరేటింగ్‌లో ఓటింగ్ సరళిని మార్చి ఫలితాలను తదనుగుణంగా తయారు చేయవచ్చన్న వార్త ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

**దేశంలోని 16 రాజకీయ పార్టీలు తమకు ఈవీఎంల విధానంపై నమ్మకంలేదని బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలని ఏప్రిల్ 11న ఎన్నికల సంఘానికి వినతిపత్రాన్ని సమర్పించాయి.** పేపర్ బ్యాలెట్ ఆడిట్‌కు నిలుస్తుందా లేదా అని నిర్ధారించడానికి విచారణ జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలను బీజేపీ తలకెక్కించుకోవడం లేదు. ఉత్తరప్రదేశ్ ఈవీఎంలను పరీక్షిస్తున్న సమయంలో వాటిలోకి ఫీడ్ చేసిన డేటాను భిండ్ పోలింగ్ సమయంలో తొలగించకుండా ఉంచడంతో ఓటింగ్ స్లిప్పులన్నీ బీజేపీకే జతయ్యాయని ఎన్నికల సంఘం నియమించిన విచారణ సంఘం వెల్లడించింది. అమెరికాతో సహా, నెదర్లాండ్స్, ఇంగ్లండ్, జర్మనీ మొదలైన దేశాలన్నీ పేపర్ బ్యాలెట్‌లనే ఉపయోగిస్తున్నారు. మాసిడోనియా, ఉక్రెయిన్‌లలో ఉపయోగించిన ఈవీఎంల వ్యవస్థను పరిశీలించి దుర్వినియోగానికి ఎలా వీలు కలిగి ఉన్నాయో అమెరికా భద్రతా వ్యవహారాల శాఖ నిపుణుడు సీగల్ బట్టబయలు చేశారు.

మన దేశంలో 10,40,000 ఈవీఎంలను ఉపయోగిస్తున్నారు. వీటిని ఈవీఎంలను దేశీవాళీ ఎలక్ట్రానిక్ పరికరాన్ని అనుసంధానం చేసి అనుకున్న ఫలితాలను ఎలా రాబట్టవచ్చో మిచిగన్ వర్సిటీ శాస్త్రవేత్తలు ఒక వీడియోను ప్రదర్శించారు. **ఎన్నికల్లో ధన, అరాచక ప్రాబల్యాలను అడ్డుకోలేని ఎన్నికల కమిషన్ ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించే ఈవీఎంలను మాత్రం సమర్థించడం సిగ్గుచేటు...** ప్రజలు తమకు కలిగిన ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలంటే బ్యాలెట్ పేపర్లే సరైనవని గుర్తించాలి. లేదంటే తాము తిరస్కరించినవారు పాలకులుగా ఉంటారు. తస్మాత్ జాగ్రత్త ....

–బోస్







Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18